# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :35 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: ఆదివారం 24-03-2024 | పేజీలు:4 వెల: 2.00


## పెరుగుతున్న విద్యుత్ వాడకం

హైదరాబాద్,వేసవి ప్రారంభంతో తెలంగాణలో విద్యుత్ డిమాండ్ పెరుగుతోంది. ఇది ఏటా జరిగగే ప్రక్రియే. నిరతంర విద్యుత్ సరఫరా కారణంగా ప్రజలు కూడా బిల్లులకు వెరవకుండా వాడేస్తున్నారు. గత నాలుగైదు రోజులు వాతావరణంలో కొంత మార్పుతో చల్లగా ఉన్నా మళ్లీ ఎండవేడిమి అందుకుంది. దీంతో వినియోగంలో ఆల్‌టైమ్ రికార్డు త్వరలో నమోదుకానుందని విద్యుత్ వర్గాలు చెబుతున్నాయి. తెలంగాణ వచ్చిన నాటి పరిస్థితితో పోల్చుకుంటే ప్రస్తుతం డిమాండ్ అధికమని అంటున్నారు. మున్ముందు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్టు చెబుతున్నారు. విద్యుత్ ప్రసారంలో సమస్యలు రాకుండా చూడాలని సిఎం రేవంత్ రెడ్డి కూడా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. కొందరు విద్యుత్ సమస్యలు సృష్టించాలని చూసినా..వెంటనే గుర్తించి అలాంటి వారికి కత్తెర వేశారు. విద్యుత్ వినియోగం పెరగగనుండడంతో కరెంట్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు. తెలంగాణలో కరెంటు డిమాండ్ ఆల్ టైమ్ రికార్డుకు దగ్గర్లో ఉంటోంది.

## లిక్కర్ స్కామ్ మనీ బిజెపి ఖాతాల్లోకే వెళ్లింది



న్యూఢిల్లీ : ఢిల్లీలో లిక్కర్ స్కామ్ మనీ అంతా ఎలక్టోరల్ బాండ్ల రూపంలో బిజెపి ఖాతాల్లోకే వెళ్లిందని ఢిల్లీ విద్యాశాఖా మంత్రి అతిషి అన్నారు. ఈ స్కామ్ కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఇడి గురువారం రాత్రి అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తమ పార్టీ నేతపై మోడీ ప్రభుత్వం చూపుతున్న దారణ వైఖరికి ఆప్ నేత అతిషి తీవ్రంగా విమర్శించారు. శనివారం ఈమె మీడియాతో మాట్లాడుతూ.. 'లిక్కర్ స్కామ్ డబ్బు బిజెపి ఖాతాల్లోకి వెళ్లింది. ఈ విషయంలో బిజెపి జాతీయ అధ్యక్షుడిని జెపి నడ్డాను అరెస్టు చేయాలి' అని ప్రధాని మోడీకి, ఇడికి ఆమె సవాల్ విసిరారు. ఇక ఈ సందర్భంగా 'స్కామ్‌కి సంబంధించి ఇప్పటివరకు ఏ ఆప్ నేత వద్ద డబ్బు దొరకలేదు. ఈ కేసుకు సంబంధించి సిబిఐ, ఇడి దర్యాప్తు సంస్థలు రెండేళ్లుగా సోదాలు కొనసాగిస్తున్నాయి. ఈ రెండేళ్లలో డబ్బులు ఎక్కడికి పోయాయనే ప్రశ్నలు మళ్లీ మళ్లీ తలెత్తుతూనే ఉన్నాయి. ఆప్‌కి చెందిన నాయకుడి వద్ద కానీ, లేదా మంత్రి వద్ద కానీ ఒక్కరూపాయిని రికరవరీ చేయలేదు.' అని అతిషి అన్నారు. అరబిందో ఫార్మా యజమాని శరద్ చంద్రారెడ్డి వాంగ్మూలం ఆధారంగానే అరవింద్ కేజ్రీవాల్‌ను రెండు రోజుల క్రితం అరెస్టు చేశారు. లిక్కర్ స్కామ్‌కి సంబంధించి నవంబర్ 9 2022న శరద్ చంద్రారెడ్డిని ప్రశ్నించారు. అయితే తానెప్పుడూ అరవింద్ కేజ్రీవాల్‌ని కలవలేదని, మాట్లాడలేదని, ఆప్‌తో తనకెలాంటి సంబంధం లేదని చెప్పారు. అయితే ఇలా చెప్పిన మరుసటిరోజే అతన్ని ఇడి అరెస్టు చేసింది. అతను కొన్ని నెలలు జైలో ఉన్నాడు. ఆ తర్వాత ఆయన స్టేట్‌మెంట్ మారిపోయింది. తాను అరవింద్ కేజ్రీవాల్‌ను కలిశానని, ఎక్సైజ్ పాలసీ విషయమై తనతో మాట్లాడానని చెప్పారు. దీంతో ఆయనకు వెంటనే బెయిల్ మంజూరైంది. శరత్ చంద్రారెడ్డి బిజెపికి 4.5 కోట్ల విలువైన ఎలక్టోరల్ బాండ్లను ఇచ్చాడు. ఆపై 55 కోట్ల విలువైన బాండ్లను కూడా ఇచ్చాడు. ఎన్నికల బాండ్ల రూపంలో ఈ మనీ అంతా బిజెపి ఖాతాకే చేరింది అని ఢిల్లీ మంత్రి అతిషి అన్నారు. ఈ సందర్భంగా బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డాను అరెస్టు చేయాలని ప్రధాని మోడీకి, ఇడికి అతిషి సవాల్ విసిరారు.

## బిగ్‌బాస్‌కు స్వాగతం.. కేజ్రీవాల్‌కు సుఖేశ్ లేఖ

న్యూఢిల్లీ,ఆర్థిక నేరారోపణల కింద తీహార్ జైలులో ఉన్న కన్?మన్? సుఖేశ్ చంద్రశేఖర్ ఎప్పటికప్పుడు లేఖలు విడుదల చేస్తూ.. పలు సంచలనాలకు కేరాఫ్‌గా మారాడు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో కవిత, ఆప్ నేతలు కేజ్రీవాల్, సత్యేంద్రజైన్, సిసోడియాపై ఇప్పటికే ఆరోపణలు చేస్తూ సుఖేష్ పలు లేఖలు విడుదల చేశాడు. తాజాగా ఎమ్మెల్సీ కవిత అరెస్ట్‌కు తీహార్ జైలు స్వాగతం పలుకుతుందంటూ లేఖ రాసిన సుఖేష్.. కేజ్రీవాల్‌ను వదిలిపెట్టలేదు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కేజ్రీవాల్‌ను ఈనెల 21న ఈడీ అరెస్ట్ చేయగా.. శుక్రవారం ఆయనను 6 రోజుల ఈడీ కస్టడీకి కోర్టు అనుమతించింది. దీంతో 'తీహార్ క్లబ్'లోకి స్వాగతం అంటూ సుఖేష్ శనివారం మరో లేఖ విడుదల చేశాడు.

ముడుపులు డిమాండ్ చేసింది కేజ్రీవాలే..


కేజ్రీవాల్ మోసగాడు.. సత్యం ఎప్పటికీ గెలుస్తుంది.. చట్టానికి ఎవరూ అతీతులు కాదని చెప్పడానికి ఇదే ఉదాహరణ అంటూ సుఖేష్ తన లేఖలో పేర్కొన్నాడు. తీహార్ క్లబ్ బిగ్ బాస్‌గా మిమ్మల్ని స్వాగతిస్తున్నానంటూ లేఖలో పేర్కొన్నాడు. మీ డ్రామాలు చివరి దశకు చేరుకున్నాయి. ఇక ఎంత నటించినా తప్పించుకోలేరని సుఖేష్ లేఖలో పేర్కొన్నాడు. మార్చి 25వ తేదీన తన పుట్టినరోజ ని, మూడు రోజుల ముందే బర్త్‌డే సెలబ్రేషన్స్ జరుపుకుంటున్నట్లు తెలిపాడు. మీ అరెస్ట్‌ను నా పుట్టినరోజు బహుమతిగా భావిస్తున్న అంటూ సుఖేష్ పేర్కొన్నాడు.



ముగ్గురు సోదరులు..

తీహార్ జైలును నడపడానికి తన ముగ్గురు సోదరులు ఇక్కడకు వచ్చారని.. ఒకరు ఛైర్మన్ బిగ్‌బాస్ అరవింద్ కేజ్రీవాల్ అయితే.. సీఈవో మనీష్ సిసోడియా, సీఓఓ సత్యేందర్ జైన్ అంటూ సుఖేష్ తన లేఖలో పేర్కొన్నాడు. బ్రదర్ కేజ్రీవాల్ మీ అవినీతి అంతా బయట పడబోతుంది.. మీరు సీఎం హోదాలో చేసిన స్కామ్‌లతో పేదలను దోచుకున్నారు అంటూ సుఖేష్ ఆరోపించాడు. మీ మోసాలను పూర్తిగా బహిర్గతం చేస్తానంటూ లేఖలో హెచ్చరించాడు.

## ఇదేళ్లలో గంజాయి వనంగా మారిన ఎపి



విజయవాడ,మార్చి23: విశాఖ డ్రగ్స్ కేసులో నిందితులుగా ఉన్నది వైసీపీ నాయకులేనని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు మరోమారు ఆరోపించారు. వైసీపీ నాయకులతో నిందితులకు సంబంధాలు ఉన్నాయనే విషయం రాష్ట్ర ప్రజలకు తెలుసని అన్నారు. విజయవాడ టీడీపీ వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడుతూ.. కూనం వీరభద్రరావుకు వైసీపీ నాయకులతో సంబంధాలున్నాయన్నారు. సంక్రాంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఫెక్సీల్లో జగన్, వైసీపీ నేతల ఫోటోలు ఉన్నాయని.. దీనికి సమాధానం చెప్పకుండా తిరిగి తమపై దాడి చేసేందుకు వైసీపీ ప్రయత్నం చేస్తోందన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని గంజాయి వనంగా మార్చేశారని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌ను డ్రగ్స్ క్యాపిటల్‌గా మార్చిన ఘనత వైసీపీకే దక్కుతుందన్నారు. గతంలో కాకినాడ ఎమ్మెల్యే డ్రగ్స్ కేసులో ఇరుక్కుంటే.. ఆ కేసులో ఇప్పటిరవకు ఎటువంటి పురోగతి లేదన్నారు. వైసీపీ నేతల అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని.. ఈ ఎన్నికల్లో ప్రజలు జగన్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. డ్రగ్స్ మాఫియా నుంచి ఆంధప్రదేశ్‌ను కాపాడుకోవల్సిన అవసరం ప్రజలపైనే ఉందన్నారు. ఇకపోతే ఈ ఎన్నికలు అత్యంత ప్రతిష్టాత్మకమని, ఎన్నికల యుద్ధంలో గెలిచి తీరాలని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. చంద్రబాబు అధ్యక్షతన విజయవాడలో జరిగిన టీడీపీ వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఎన్నికల్లో పొత్తు పెట్టుకోలేదని.. రాష్ట్ర భవిష్యత్తు కోసం కలిసి ముందుకెళ్తున్నామన్నారు. వైసీపీ కుట్రలను రాష్ట్ర ప్రజలు తిప్పికొట్టాలన్నారు. గెలుపే ధ్యేయంగా ముందుకెళ్లాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి తరపున ఏ అభ్యర్థి పోటీ చేసినా గెలిపించాలని, మూడు పార్టీల నాయకులు సమన్వయంతో ముందుకెళ్లాలని చంద్రబాబు సూచించారు. రాజకీయ పార్టీ ప్రయోజనం కోసమో.. గెలిచే అభ్యర్థుల ప్రయోజనాల కోసం తాను ఆలోచించడం లేదని రాష్ట్ర భవిష్యత్తు కోసమే ఆలోచిస్తున్నట్లు చెప్పారు. గాడి తప్పిన పాలనను గాడిలో పెట్టడమే తన ముందున్న లక్ష్యమని చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. చాలా కసరత్తు తర్వాత అభ్యర్థులను ఎంపిక చేశామన్నారు. సర్వేల ఆధారంగా టికెట్లు కేటాయించినట్లు తెలిపారు. పార్టీలో ఎప్పటినుంచో ఉంటున్న కొందరికి టికెట్లు ఇవ్వలేకపోయామని.. వైసీపీని బలంగా ఎదుర్కొనేందుకు కొన్ని నిర్ణయాలు తీసుకోవల్సి వచ్చినట్లు చంద్రబాబు వివరించారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు ప్రతి కార్యకర్త, ప్రజలు ఎంతో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో ఓట్లు చీలకూడదనే లక్ష్యంతో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ముందుకు వచ్చారని మన లక్ష్యం కూడా అదేనని చంద్రబాబు తెలిపారు. పొత్తులపై అసత్యాలు ప్రచారం చేస్తూ వైసీపీ కుట్రలకు పాల్పడుతోందని ఆరోపించారు. వైసీపీ అసత్య ప్రచారాలను నమ్మకుండా.. కూటమి అభ్యర్థులనే రాష్ట్ర వ్యాప్తంగా గెలిపించాలని కోరారు. తాను 160 నియోజకవర్గాల్లో 160 సభల్లో పాల్గొంటానని.. 160 నియోజకవర్గాల్లో కూటమిని గెలిపించాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. ఎన్నికల వేళ అభ్యర్థులు జాగ్రత్తగా ఉండాలని టిడిపి అధినేత చంద్రబాబు సూచించారు. రాష్ట్రంలో రౌడీయిజం, అధికార దుర్వినియోగం కనిపిస్తోందని చెప్పారు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని అభ్యర్థులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసమే తాము పొత్తు పెట్టుకున్నామని అదే అభిప్రాయంతో జనసేన ముందుకు వచ్చిందని తెలిపారు. పద్ధతి ప్రకారం రాజకీయం చేసిన వ్యక్తి పవన్ కల్యాణ్ అని అన్నారు. పొత్తులో భాగంగా 31 మందికి సీట్లు ఇవ్వలేకపోయామని సీట్లు రానివారు కష్టపడలేదని కాదు.. రాష్ట్రంకోసం త్యాగం చేస్తున్నారని చంద్రబాబు అన్నారు.

### ఎస్సీ వర్గీకరణకు పోరాడుతూనే ఉంటాం

గుంటూరు, ఎస్సీలో ఏబీసీడీ వర్గీకరణను మాదిగలు బలంగా కోరకుంటున్నారని మాదిగ ఉద్యోగ సమాఖ్య నేతలు అన్నారు. ఎస్సీ వర్గీకరణ ద్వారా ఎస్సీలోని 59 ఉపకులాలకు పూర్తి స్థాయిలో న్యాయం జరుగుతుందని అన్నారు. ఎస్సీ వర్గీకరణను మాదిగలతో పాటు, ఉపకులాలు బలంగా కోరుకుంటున్నారని అన్నారు. ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ సాధించుకునేందుకు మంద కృష్ణమాదిగ నేతృత్వంలో పోరాటాలు చేస్తున్నామని అన్నారు. ఇదిలావుంటే ఎస్సీ వర్గీకరణ పక్రియను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే నిలిపివేయాలని, లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా దశలవారీగా ఉద్యమిస్తామని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కన్వీనర్ హెచ్చరించారు. రాష్ట్రంలో తెలుగుదేశం, కేంద్రంలో భాజపా కులాల మధ్య చిచ్చుపెట్టాలని చూస్తున్నాయని ఆరోపించారు.

## ఇది రాజకీయ కేసు..

## న్యాయపోరాటం చేస్తా: ఎమ్మెల్సీ కవిత

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఈడీ విచారణపై ఎమ్మెల్సీ కవిత అసహనం వ్యక్తంచేశారు. ఏడాది నుంచి అడిగిన వివరాలే మళ్లీ మళ్లీ అడుగుతున్నారని చెప్పారు. ఇది రాజకీయ కేసు అని, తప్పుడు కేసని, ఉద్దేశపూర్వకంగా పెట్టిన కేసన్నారు. తన అరెస్టు పూర్తిగా చట్ట విరుద్ధమని తెలిపారు. కోర్టులో న్యాయపోరాటం చేస్తామన్నారు.

కస్టడీ ముగియడంతో ఎమ్మెల్సీ కవితను ఈడీ అధికారులు ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపరిచారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిథులతో ఎమ్మెల్సీ కవిత మాట్లాడారు. ఇప్పటికే బెయిల్ పిటిషన్ దాఖలు చేశామని కవిత తరఫు నాయ్యవాది కోర్టుకు తెలిపారు. కస్టడీ పూర్తయిన రోజే బెయిల్ పిటిషన్‌పై విచారణ జరపాలని కోరారు. బెయిల్ పిటిషన్‌పై ఈడీకి నోటీసులు ఇవ్వాలన్నారు. కవిత పిల్లలు మైనర్లని, వారిని కలిసేందుకు అవకాశం కల్పించాలని తెలిపారు. కాగా, మరో ఐదురోజులపాటు కస్టడీ పొడిగించాలని ఈడీ తరపు లాయర్లు న్యాయస్థానాన్ని కోరారు. కేసులో ఉన్న మరికొన్ని అంశాలపై విచారణ జరపాలని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. నలుగురి స్టేట్‌మెంట్లతోపాటు కిక్ బ్యాగ్స్ గురించి కవితను అడిగామని చెప్పారు. లిక్కర్ స్కామ్‌లో కోట్ల రూపాయలు చేతులుమారయన్నారు. డాక్టర్ల సూచనతో కవితకు మందులు, డైట్ ఇస్తున్నామని తెలిపారు. ఇరు వర్గాల వాదనలు విన్న జడ్జి తీర్పును రిజర్వులో ఉంచారు.

ఎమ్మెల్సీ కవిత కస్టడీ మరో మూడు రోజులు పొడిగింపు

తెలంగాణ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కస్టడీని ఢిల్లీలోని రౌజ్ అవెన్యూ కోర్టు మరో మూడు రోజులు పొడిగించింది. ఇప్పటికే కవితకు విధించిన ఏడు రోజుల కస్టడీ గడువు నేటితో ముగియడంతో.. ఈడీ అధికారులు ఆమెను ఇవాళ కోర్టులో



ప్రవేశపెట్టారు. మరో మూడు రోజులు ఆమెను తమకు కస్టడీకి ఇవ్వాలని కోరారు. దాంతో కోర్టు కవిత కస్టడీని మరో మూడు రోజులు పొడిగించింది. అంతకుముందు కోర్టులోపలికి వెళ్తూ ఆమె.. ఈడీ విచారణపై అసహనం వ్యక్తంచేశారు. ఏడాది నుంచి అడిగిన వివరాలే మళ్లీ మళ్లీ అడుగుతున్నారని అన్నారు. తనపై పెట్టింది రాజకీయ కేసని, తప్పుడు కేసని, ఉద్దేశపూర్వకంగా పెట్టిన కేసని వ్యాఖ్యానించారు. తన అరెస్టు పూర్తిగా చట్ట విరుద్ధమని, కోర్టులో న్యాయపోరాటం చేస్తామని చెప్పారు. కాగా, కవిత కస్టడీని మరో మూడు రోజులు పొడిగించాలని ఈడీ తరఫు న్యాయవాదులు కోరారు. కేసులో మరికొన్ని అంశాలపై విచారణ జరపాల్సి ఉందని కోర్టుకు తెలిపారు. నలుగురి స్టేట్‌మెంట్లతోపాటు కిక్ బ్యాగ్స్ గురించి కవితను అడిగామని చెప్పారు. లిక్కర్ కేసులో కోట్ల రూపాయలు చేతులు మారయన్నారు. డాక్టర్ల సూచన ప్రకారం కవితకు మందులు, డైట్ ఇస్తున్నామని తెలిపారు.

## ఎలక్టోరల్ బాండ్స్ తెచ్చింది అందుకే అంటున్న కేంద్రమంత్రి!



న్యూఢిల్లీ,లోక్ సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఇప్పుడు దేశవ్యాప్తంగా ఎలక్టోరల్ బాండ్ల వ్యవహారం తీవ్ర చర్చనీయాంశం అయిన సంగతి తెలిసిందే. ఈ పథకాన్ని సుప్రీంకోర్టు రద్దు చేసిన నేపథ్యంలో కేంద్రంపై విపక్షాలు విరుచుకుపడుతున్నాయి. పైగా.. ఈ పథకం వల్ల క్విడ్ ప్రోకో రూపం మార్చుకుందని, ఫలితంగా అధికారపార్టీ ఖజానా నిండిందని రకరకాల కామెంట్లు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ స్పందించారు. ఇందులో భాగంగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అవును... ఇప్పుడు దేశవ్యాప్తంగా ఎలక్టోరల్ బాండ్లు తీవ్ర చర్చనీయాంశం అయిన వేళ జరుగుతున్న పరిణామాలపై కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ స్పందించారు. ఇందులో భాగంగా... మంచి ఉద్దేశ్యంతోనే కేంద్రం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. ఇదే క్రమంలో.. విరాళాలు లేకుండా ఒక రాజకీయ పార్టీని నడపడం సాధ్యంకాదని కుండబద్దలు కొట్టారు! గుజరాత్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా గడ్కరీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇదే క్రమంలో... అరుణ్ జైట్లీ ఆర్థిక మంత్రిగా ఉన్న సమయంలో ఈ పథకం గురించిన చర్చలు జరిగాయని, నాడు జరిగిన ఆ చర్చల్లో తానుకూడా ఉన్నట్లు తెలిపిన గడ్కరీ... ఆర్థిక వనరులు లేకుండా ఏ పార్టీ మనుగడ సాధించలేదని తెలిపారు. అసలు కొన్ని దేశాల్లో ప్రభుత్వాలే ఆయా రాజకీయ పార్టీలకు నిధులు సమకూర్చుస్తాయని.. ఐతే... మన దేశంలో అలాంటి అవకాశం లేకపోవడం వల్లే ఇలాంటి స్కీం తీస్సుకొచ్చినట్లు వెల్లడించారు.ట అసలు ఈ స్కీం తీసుకొచ్చిన ప్రధాన ఉద్దేశ్యమే.. పార్టీలకు నేరుగా నిధులు పొందేందుకే అని.. అధికారంలో ఉన్న పార్టీ మారితే విరాళాలు ఇచ్చేవారికి సమస్యలు తలెత్తుతాయనే కారణంతోనే దాతల పేర్లు రహస్యంగా ఉంచడం జరిగిందని అన్నారు. విరాళాల విషయంలో పారదర్శకత ఉండాలన్న సదుద్దేశంతోనే ఈ బాండ్ల పథకాన్ని ప్రవేశపెట్టినట్లు చెప్పుకొచ్చారు! దీనిలో ఏవైనా లోటుపాట్లు ఉన్నట్లు సుప్రీంకోర్టు గుర్తిస్తే.. సరిదిద్దమని పార్టీలను కోరాల్సిందని అభిప్రాయపడ్డారు. కాగా... ఎన్నికల బాండ్ల పథకాన్ని రద్దుచేస్తూ ఈ ఏడాది ఫిబ్రవరిలో సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా... దీనికి సంబంధించిన బాండ్ల వివరాలన్నీ సమర్పించాలని స్టేట్ బ్యాంక్ కు సూచించింది. ఈ సమయంలో కేంద్ర ఎన్నికల సంఘం తన వెబ్ సైట్ లో ఉంచింది. ఈ నేపథ్యంలో ఫైనల్ లిస్ట్ కూడా వెలువడటంతో సంచలన విషయాలు తెరపైకి వస్తున్నాయి!!

## రేవంత్ పాలనాతీరుపై ప్రజల్లో భరోసా

హైదరాబాద్,మార్చి23: తెలంగాణలో టీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు దూకుడుగా తమ రాజకీయాలకు పదును పెడుతున్నాయి. ఎవరికి వారు పరస్పర విమర్శలతో వ్యూహ రచనలకు పూను కుంటున్నారు. ప్రత్యర్థులకు ఆలోచనలకు అందకుండా వ్యూహాలు రచించేస్తున్నారు. బిఆర్ఎస్ లక్ష్యంగా బిజెపి, కాంగ్రెస్ విమర్శలకు దిగుతున్నారు. గతంలో పదేళ్ల బిఆర్ఎస్ పాలనా పాపాలను లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల్లో కూడా అదే అస్త్రం కాబోతున్నది. అయితే గత వందరోజుల పాలన తీరు కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉంది. ప్రజల్లో కూడా సానుకూలత ఏర్పడింది. దీంతో ఆ పార్టీ అత్యధిక ఎంపి సీట్లు గెల్చుకునేందుకు వ్యూహం పన్నుతోంది. మరీ ముఖ్యంగా సిఎం రేవంత్ రెడ్డి పాలనాతీరు ప్రజల్లో బాగా నాటుకుపోయింది. ఆయన పట్ల ప్రజల్లో ఆరాధనా భావం ఏర్పడుతోంది. ఏదైనా చేయగలడన్న నమ్మకం ఏర్పడింది. అలాగే మోడీ పాలనా వైఫల్యాలను కూడా కాంగ్రెస్ ప్రచారంలో ఎండగట్టబోతున్నది. మరోవైపు ఎన్నికల్లో అభ్యర్థులను దింపడమే కష్టంగా మారిన తరుణంలో కెసిఆర్ వ్యూహం ఎలా ఉంటుందో చెప్పడం కష్టం. ప్రజల్లో ఆదరణ కోల్పోవడంతో ఆ పార్టీకి ఎంపి సీట్లు గెలవడం గడ్డుగా మారింది. ఇప్పటికే బిజెపి, కాంగ్రెస్ లక్ష్యంగా కెసిఆర్ మెల్లగా విమర్శలకు దిగుతున్నారు. కేజ్రీవాల్ అరెస్ట్‌పై తొలిసారిగా స్పందించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ప్రస్తుతం తెలంగాణ బిఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్‌లతో పాటు ఇతర పార్టీలు ఉన్నా.. తారాస్థాయి పోరుమాత్రం కాంగ్రెస్, బీజేపీల మధ్యనే ఉండబోతోంది. ఇటీవల చేసిన కొన్ని సర్వేల్లో బిజెపి,కాంగ్రెస్‌లకు మాత్రమే పోటీ ఉంటుందని సర్వేలు చెబుతున్నాయి. దీంతో ఆయా రాజకీయ పార్టీలు తమ నమ్మకమైన సంస్థలతో సర్వేలు చేయించు కుంటున్నాయి. సర్వేల్లో వచ్చిన ఫలితాలకు కూడా ప్రాధాన్యత ఇస్తూ.. తమతమ పార్టీల బలోపేతా



నికి కృషి చేసే ఆలోచనల పడ్డారు అగ్రనేతలు. పార్లమెంటులో గెలవడం ఈ మూడు పార్టీలకు అవసరం. అందుకే ఆచితూచి అడుగులు వేస్తున్నారు. బీజేపీ నేతలు సైతం తమ సర్వే ఫలితాల్లో పార్టీ ఏ చోట బలహీనంగా ఉంది.. ప్రజలు దృష్టిని ఆకర్షించేందుకు వేయాల్సిన ఎత్తుగడలేంటని కసరత్తు మొదలెట్టారు. మొన్నటి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో బిఆర్ఎస్‌కు ప్రత్యమ్నా యంగా నిలిచింది. టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి నియామకమైన నాటి నుంచి తన దైన శైలిలో ముందుకు పోతున్న విషయం తెలిసిందే. రేవంత్ రెడ్డి అధ్యక్ష పదవిని చేతబూని..అంపశయమీద ఉన్న తెలంగాణ కాంగ్రెస్‌కు ఊపిరి పోశా రని రాజకీయ విశ్లేషకులు అప్పుడే చెప్పారు. సిఎంగా బాధ్యతలు చేపట్టాక అందరినీ కలుపుకోని వెళ్తున్నట్లు ఉన్న రేవంత్ రెడ్డికి.. పార్లమెంట్ ఎన్నికల్లో సీట్లు సాధించడం సవాల్ లాంటిదే. సర్వేల్లో చూస్తే..కాంగ్రెస్‌పై ప్రజల్లో నమ్మకం ఉంది..ఎన్నికల నాటికి సిద్ధమయ్యేందుకు అన్ని పార్టీలు వ్యూహాలు పన్నుతున్నాయి.

## సంపాదకీయం

ఆదివారం 24-03-2024

# వ్లదిమిర్ పుతిన్ ఎన్నిక పూర్వరంగం !

మార్చి 15 నుంచి 17 వరకు జరిగిన రష్యా ఎనిమిదవ అధ్యక్ష ఎన్నికలలో వ్లదిమిర్ పుతిన్ ఏకపక్షంగా విజయం సాధించారు. ప్రధాని లేదా అధ్యక్ష పదవిలో వరుసగా ఐదవసారి అధికార పీఠమెక్కి రికార్డు సృష్టించారు. పుతిన్ విజయం ఎన్నికలకు ముందే ఖరారైందని అంతర్జాతీయ మీడియా రాసింది. ప్రస్తుతం యావత్ రష్యన్లను జాతీయ భావాలు ప్రభావితం చేస్తున్నాయి. పుతిన్ అనుసరిస్తున్న ఆర్థిక, ఇతర విధానాల పట్ల దేశంలో జనమందరూ ఏకీభావంతో ఉన్నారని చెప్పలేంగాని 'నాటో' కూటమి తమను దెబ్బ తీసేందుకు ఉచ్చు బిగిస్తున్నదనే అంశంలో మాత్రం తరతమ తేడాలతో ఒకే వైఖరితో ఉన్నారనేందుకు తాజా ఎన్నికలే నిదర్శనం. పశ్చిమ దేశాల ప్రసార బాకాలు ఉక్రెయిన్ మీద జరుపుతున్న సైనిక చర్యను ప్రజలు వ్యతిరేకిస్తున్నారని ఎంతగా ప్రచారం చేసినా అధ్యక్ష ఎన్నికల్లో 77.49 శాతం మంది ఓటింగ్‌లో పాల్గొనటం ఒక రికార్డు. గత ఎన్నికల కంటే 9.95 శాతం పెరిగింది. నిజంగా జనాలలో వ్యతిరేకత, ఆసక్తి లేకపోతే పోలింగ్ బూత్‌లకే రారు. ఉక్రెయిన్‌పై సైనిక చర్యతో పశ్చిమ దేశాలు రష్యాను మరింతగా ఒంటరిపాటు చేసేందుకు చూడటం, ఆంక్షలు విధించటం తెలిసిందే. తాజా ఎన్నికల పూర్వరంగమిదే. రష్యాను ఒక బూచిగా చూపటమే కాదు, పద్దెనిమిదివేల ఆంక్షలు విధించారు. ఉక్రెయిన్‌కు దగ్గరగా ఉన్న ఎనిమిది ప్రాంతాలపై నాటో, అమెరికన్ మద్దతుతో దాడులు చేశారు. ఉక్రెయిన్‌లోని రష్యన్ జాతి వారిని అణచివేసేందుకు పూనుకున్నారు. రష్యాను దెబ్బతీసేందుకు ఉక్రెయిన్ కేంద్రంగా నాటో కూటమి దేశాలు జీవాయుధాలను తయారు చేస్తున్నట్లు విశ్వసనీయమైన సమాచారం ఉన్న తరువాత రష్యా గద్దె మీద ఉన్న వారెవరైనా ఆ ముప్పును ఎదుర్కోవాల్సిందే. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో కొన్ని జాతులను సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా రెచ్చగొట్టి యుద్ధంలో ఎలా ఉపయోగించుకున్నారో అదే జాతులను ఇప్పుడు రష్యాకు వ్యతిరేకంగా సమీకరించటాన్ని చూసిన సామాన్య రష్యన్ పౌరులు మరోసారి తమకు ఫాసిస్టు ప్రమాదం ముంచుకువస్తున్నదని భావిస్తున్నారు. ఇదే అభిప్రాయం ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న రష్యన్ కమ్యూనిస్టులలో కూడా ఉన్నకారణంగానే ఉక్రెయిన్‌పై సైనిక చర్యను సమర్ధించారు. దీని అర్థం పుతిన్ విధానాలన్నింటినీ సమర్ధిస్తున్నట్లు కాదు. అందుకే ఉక్రెయిన్‌పై సైనిక చర్యను వ్యతిరేకించిన శక్తులను దేశ వ్యతిరేకులుగా భావిస్తున్నట్లు కనిపిస్తోంది. ఈ ఎన్నికలలో మొత్తం నలుగురు పోటీ చేస్తే పుతిన్‌కు 87.28 శాతం రాగా రెండవ స్థానంలో ఉన్న కమ్యూనిస్టు నేతకు 4.31 శాతం ఓట్లు వచ్చాయి.ధనిక దేశాల కూటమిలో చేరేందుకు ఉవ్విళ్లూరిన పుతిన్ గతం దాస్తే దాగేది కాదు. అయితే వాటి మధ్య తలెత్తిన వైరుధ్యాలు ఈ రూపం సంతరించుకుంటాయని మూడు దశాబ్దాల క్రితం ఎవరూ ఊహించలేదు. నయా ఫాసిస్టు శక్తులు, వాటిని వ్యతిరేకించే శక్తుల మధ్య వైరంగా చూసినపుడు అంతర్జాతీయ రాజకీయాల్లో పుతిన్‌ను పురోగామి శక్తులు సమర్ధిస్తున్నాయి. జాతీయ భావాలు అంటే రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు జర్మనీలో హిట్లర్ గ్యాంగ్ రెచ్చగొట్టిన జర్మన్ ఆధిపత్యవాదానికి, తమ దేశాన్ని కాపాడుకోవాలన్న రష్యన్ల భావనకు తేడా ఉంది. వ్లదిమిర్ పుతిన్ పురోగామి వాద, ప్రజాస్వామ్య పరిరక్షకుడో అని కితాబు ఇవ్వాల్సిన అవసరం లేదు. పూర్వపు సోవియట్ యూనియన్ వ్యవస్థలో ప్రజల సంపదగా ఉన్నదానిని గత మూడు దశాబ్దాల కాలంలో కొందరు ఆశ్రితులు, ప్రైవేటు పరం చేసిన వ్యవస్థ ప్రతినిధి పుతిన్. అయితే చమురు, సహజ వాయువు వంటి అపార సంపదలు ఇంకా ప్రభుత్వ రంగంలోనే ఉన్నప్పటికీ పూర్తిగా పెట్టుబడిదారీ వ్యవస్థ వైపే అడుగులు పడుతున్నాయి. రష్యాకు ఉన్న సహజ సంపదలు, మిలిటరీ, ఆయుధాల కారణంగా అది తమకు ఎక్కడ పోటీకి వస్తుందో అన్న భయంతో అమెరికా, ఐరోపా లోని ధనిక దేశాలు అడ్డుకొనేందుకు చూడటమే రష్యాతో వాటికి ఉన్న ప్రధాన వైరుధ్యం. ధనిక దేశాల కూటమి జి-7 లోకి రాకుండా ముందు చూశారు. తరువాత చేర్చుకొని, తిరిగి పక్కన పెట్టారు. నాటోను విస్తరించి రష్యా ముంగిట ఉన్న ఉక్రెయిన్‌ను మిలిటరీ కేంద్రంగా మార్చి అదుపు చేయాలన్న ఎత్తుగడను పుతిన్ జయప్రదంగా వమ్ముచేశాడు. గతంలో రష్యా ప్రాంతంగా ఉండి సోవియట్ హయాంలో ఉక్రెయిన్ రిపబ్లిక్‌లో ఉన్న క్రిమియా ప్రాంతాన్ని 2014లో తిరిగి స్వాధీనం చేసుకున్నప్పటి నుంచి రష్యాలో జాతీయ భావాలు మరింతగా పెరిగాయని చెప్పవచ్చు. ప్రస్తుతం పుతిన్ బలం అదే!

# అవినీతి మరక అంటితే సీఎం అయినా లెక్కలేదు



న్యూఢిల్లీ,ఢిల్లీ లిక్కర్ కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, ఢిల్లీ ముఖ్యమంత్రి కేజీవ్రాల్‌ను ఈడీ అధికారులు అరెస్టు చేయడంతో ఇప్పుడు అనేక ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. సిఎంగా అధికారంలో ఉండగా ఓ రాష్ట్ర ముఖ్యమంత్రిని దర్యాప్తు సంస్థలు అరెస్టు చేయవచ్చా అనే సందేహాలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. దీనికి చట్టం ఏం చెబుతోంది..? అందుకు సంబంధించిన విధివిధానలు ఏమిటి అనే విషయాలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారయి. అయితే తమిళనాడు సిఎంగ ఆఉన్న సమయంలో జయలలితపై అవినీతి కేసులు నమోదయ్యాయి. ఆమెను అరెస్ట్ చేసే సమయం రావడంతో రాజీనామా చేసి, తన స్థానంలో పన్నీరు సెల్వంను సిఎంగా చేసి సందర్భం ఉంది. ఇకపోతే చట్టం దృష్టిలో ప్రతి భారతీయుడు సాధారణ వ్యక్తే.అన్నది రాజ్యాంగం చెబుతోంది. ఇందుకు ఎటువంటి నిబంధనలు లేనందువల్ల వారిపై క్రిమినల్ నేరం నమోదైతే దేశ ప్రధానమంత్రినైనా అరెస్ట్ చేయవచ్చని నిపుణులు అంటున్నారు. పాలకుల నుంచి సాధారణ వ్యక్తుల వరకు ఈ నియమం అందరికీ వర్తిస్తుందని చెబుతున్నారు. అయితే రాజ్యాంగం ప్రకారం రాష్ట్రపతిని మాత్రమే పదవిలో ఉన్నప్పుడు అరెస్టు చేయడానికి వీలులేదు. ఆర్టికల్ 361 ప్రకారం భారత రాష్ట్రపతి, రాష్ట్రాల గవర్నర్లు.. వారి అధికార విధులకు సంబంధించి కోర్టులకు జవాబుదారీగా ఉండరు. ఈ నిబంధన కింద రాష్ట్రపతి, గవర్నర్ తన పదవికి సంబంధించిన అధికారాలు, విధులను అమలు చేయడం, వారు చేసిన, చేయాలనుకుంటున్న ఏదైనా చర్యకు ఏ న్యాయస్థానానికి జవాబుదారీగా ఉండనవ సరం లేదు. ఈ ప్రత్యేక మినహాయింపు ఒక్క రాష్ట్రపతి, గవర్నర్‌లకు మాత్రమే ఉంటుంది. అందువల్ల వారు పదవిలో ఉన్నప్పుడు క్రిమినల్ నేరాలలో కూడా అరెస్ట్ చేసే అధికారం ఎవరికీ లేదు. పదవీ విరమణ అనంతరం మాత్రమే వారిపై చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుంది. వీరి పదవీకాలం ముగిసే వరకు సివిల్, క్రిమినల్ ప్రొసీడింగ్‌ల నుంచి నిరోధించవచ్చు. కానీ ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులకు ఈ రక్షణ ఉండదు. చట్టం ముందు అందరూ సమానమనేది ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రికి కూడా వర్తిస్తుంది. అందుకే వివిద సందర్భాల్లో కొందరు రాజీనామా చేసిన సందర్భాలు ఉన్నాయి. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ 1973 నిబంధనల ప్రకారం.. కోర్టు అరెస్టు వారెంట్ జారీ చేస్తే ఏ వ్యక్తినైనా అరెస్టు చేయవచ్చు. నిందితుడు పరార్ అయ్యే అవకాశం ఉందని, సాక్ష్యాలను ధ్వంసం చేయడానికి ప్రయత్నిస్తాడని, చట్టపరమైన పక్రియ నుంచి తప్పించుకునే విధంగా ప్రవర్తిస్తాడనడానికి తగిన కారణం ఉంటే మాత్రమే వారిని అరెస్టు చేయాలి. ఈ లెక్కన ఓ రాష్ట్ర ముఖ్యమంత్రిని అరెస్ట్ చేసే అధికారం రాజ్యాంగం ప్రకారం ఉంటుంది. అయితే సివిల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 135 ప్రకారం.. పార్లమెంటు సభ్యులు 40 రోజుల ముందు, 40 రోజుల తర్వాత, పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న సమయంలో అరెస్టు చేయడానికి వీలులేదు. మూడు పార్లమెంటు సమావేశాలు ఒక్కొక్కటి 70 రోజులు ఉండటంతో, దాదాపు 300 రోజుల వరకు వీరిని అరెస్ట్ చేసే అధికారం ఉండదు. ఈ రక్షణ కేవలం సివిల్ కేసులకు మాత్రమే వర్తిస్తుంది. ఇతర నేరాల విషయంలో రాజ్యసభ, లోక్‌సభ సభ్యులెవరికీ రక్షణ ఉండదు.దేశ చరిత్రలో అత్యంత వివాదాస్పద రాజకీయనాయకుల్లో దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత ఒకరు. విలక్షణమైన వ్యక్తిత్వంతో తమిళనాడు రాష్ట్రానికిపలుమార్లు ముఖ్యమంత్రిగా పనిచేశారు. అయితే ఆదాయానికి మించిన ఆస్తుల కేసుకు సంబంధించి దేశంలో మొట్టమొదటి సారి అరెస్ట్ అయిన సిట్టింగ్ ముఖ్యమంత్రిగా పేరుగాంచారు. గ్రామాలకు కలర్ టీవీ సెట్ల కొనుగోలులో అవినీతికి పాల్పడినందుకు ఆమెను డిసెంబర్ 7, 1996న అరెస్టు చేయగా.. నెలపాటు జైలులో ఉన్నారు. ఇలా జార్ఖండా సిఎం, ఇప్పుడు కేజ్రీవాల్ అరెస్ట్ అయ్యారు.

## దానం నాగేందర్‌కు హైకోర్టు నోటీసులు

హైదరాబాద్,ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఆయన ఎన్నికను రద్దు చేయాలంటూ విజయా రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరపున సుంకర నరేశ్ వాదనలు వినిపించారు. ఎన్నికల్లో ఓటర్లను దానం నాగేందర్ ప్రలోభపెట్టారని కోర్టుకు ఆయన తెలిపారు. డబ్బులు పంచడంతో పోలీసు స్టేషన్లలో కేసులు నమోదు అయ్యాయని చెప్పారు.

# ప్రాంతీయ పార్టీలకూ భారీగా విరాళాలు

న్యూఢిల్లీ,పందేలు కాసే వారి దృష్టి ఎప్పుడూ గెలుపు గుర్రాల పైనే ఉంటుంది. ఎన్నికల బాండ్ల కొనుగోలు ద్వారా రాజకీయ పార్టీలకు విరాళాలు అందించే వ్యక్తులు, సంస్థలు కూడా ఇదే సూత్రాన్ని పాటించడం సహజం. కానీ ఈ కొనుగోళ్ల వ్యవహారంలో ఇందుకు భిన్నంగా కొన్ని ఆశ్చర్యపరిచే ఉదంతాలు చోటుచేసుకున్నాయి. మొత్తంమీద రాజకీయ పార్టీలు రూ.12,769 కోట్ల విలువ కలిగిన బాండ్లను నగదుగా మార్చుకున్నాయి. వీటిలో దాదాపు సగం అంటే రూ.6,060 కోట్లు బీజేపీ జేబులోకే వెళ్లాయి. తృణమూల్ కాంగ్రెస్ రూ.1,609 కోట్లు, కాంగ్రెస్ రూ.1,421 కోట్లు, బీఆర్ఎస్ రూ.1,214 కోట్లు విరాళాలుగా అందుకున్నాయి. ఇవేవీ ఆశ్చర్యపరిచే విషయాలు కావు.న్యూఢిల్లీ : 2018 నుండి 30 దశలుగా ఎన్నికల బాండ్ల విక్రయాలు జరిగాయి. 2018 మార్చి 1 నుండి 10వ తేదీ వరకూ తొలి దశలో బాండ్లను అమ్మారు. సంవత్సరానికి నాలుగు సార్ల చొప్పున పదేసి రోజుల పాటు బాండ్లను ఎస్‌బీఐ విక్రయించింది. ఎన్నికల సంవత్సరాల్లో మరిన్ని దశల్లో బాండ్లను అమ్మింది. బాండ్లను జారీ చేసిన తేదీ నుండి 15 రోజుల్లోగా వాటిని పార్టీలు నగదుగా మార్చుకోవాల్సి ఉంటుంది. కాగా ఎన్నికల కమిషన్ తొలుత 22 దశలకు సంబంధించిన ఎన్నికల బాండ్ల సమాచారాన్నే విడుదల చేసింది. ఈ బాండ్లు 2019 ఏప్రిల్ (తొమ్మిదవ దశ) నుండి ఈ సంవత్సరం జనవరి (30వ దశ) వరకూ విక్రయించినవి. ఈ 22 దశల్లో అమ్మిన బాండ్ల సమాచారాన్ని విశ్లేషిస్తే కొన్ని ఆసక్తికరమైన, ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగు చూశాయి.13 దశల్లో అమ్మిన బాండ్లలో అధిక భాగం బీజేపీ ఖాతాకే చేరాయి. వీటిలో నాలుగు దశల్లో బీజేపీకి రూ.3,012 కోట్లు వచ్చాయి. గత సంవత్సరం అక్టోబరులో అమ్మిన బాండ్లలో మాత్రం కాంగ్రెస్‌కు ఎక్కువ మొత్తం లభించింది. 2019, 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు విక్రయించిన బాండ్లను సొమ్ము చేసుకోవడంలో సైతం బీజేపీయే ప్రత్యర్థి పార్టీల కంటే బాగా ముందంజలో ఉంది.

### తృణమూల్, బీఆర్ఎస్‌కే ఎక్కువ లబ్ది

మొత్తంమీద 22 దశల్లో జరిగిన బాండ్ల విక్రయాల్లో తృణమూల్ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కోటి మూడు దశల్లో అత్యధికంగా విరాళాలు పొందాయి. 2020 జూలైలో రూ.45.38 కోట్ల విలువ కలిగిన బాండ్లు విక్రయించగా తృణమూల్‌కు అత్యధికంగా రూ.15.38 కోట్లు అందాయి. అలాగే 2021 జనవరిలో రూ.42.07 కోట్ల విలువైన బాండ్లు అమ్మగా ఆ పార్టీకి రూ.26 కోట్లు వచ్చాయి. అదే సంవత్సరం జూలైలో రూ.150.51 కోట్ల బాండ్లు విక్రయిస్తే తృణమూల్ ఖాతాలో రూ.107 కోట్లు చేరాయి.బీఆర్ఎస్ విషయానికి వస్తే 2021 అక్టోబరులో రూ.614.33 కోట్ల విలువైన బాండ్లను అమ్మితే ఆ పార్టీకి రూ.153 కోట్ల విరాళాలు అందాయి. 2022 ఏప్రిల్‌లో రూ.648.48 కోట్ల బాండ్లు అమ్మగా బీఆర్ఎస్ ఖాతాలో రూ.410 కోట్లు పడ్డాయి. 2023 జూలైలో రూ.812.75 కోట్ల విలువ కలిగిన బాండ్లను విక్రయించగా ఆ పార్టీకి రూ.318 కోట్లు వచ్చాయి.2022 ఏప్రిల్‌లో 20వ దశ అమ్మకాలు జరిపారు. ఈ దశలో కూడా బీఆర్ఎస్ పార్టీకే ఎక్కువ విరాళాలు వచ్చాయి. ఈ దశలో వివిధ పార్టీలకు రూ.648 కోట్ల విరాళాలు అందితే ఒక్క బీఆర్ఎస్‌కే రూ.410 కోట్లు వచ్చాయి. డీఎంకేకు రూ.100 కోట్లు, బీజేపీకి రూ.98.5 కోట్లు అందాయి. ఈ దశలో ఫ్యూచర్ గేమింగ్ (రూ.100 కోట్లు), యశోద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ (రూ.80 కోట్లు), చెన్నరు గ్రీన్ ఉడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ (రూ.50 కోట్లు), డీఎల్ఎఫ్ కమర్షియల్ డెవలపర్స్ లిమిటెడ్ (రూ.40 కోట్లు), హల్దియా ఎనర్జీ (రూ.25 కోట్లు), మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (రూ.25 కోట్లు) ఎక్కువ విరాళాలు ఇచ్చాయి. 2020 అక్టోబరులో జరిగిన 14వ దశ విక్రయాల్లో వైసీపీకి అత్యధిక విరాళాలు వచ్చాయి. వివిధ పార్టీలకు రూ.282.29 కోట్ల విరాళాలు అందితే అందులో వైసీపీకి రూ.89 కోట్లు వచ్చాయి. 2021 జూలైలో జరిగిన 21వ దశ విక్రయాల్లో బీజేడీ అత్యధికంగా రూ.107 కోట్లు (మొత్తం రూ.389.5 కోట్లు) పొందింది.

### ఎన్నికలకు ముందే జోరు

అసలు ఎన్నికలే జరగని సమయంలో లేదా అక్కడక్కడా ఎన్నికలు జరిగినప్పుడు బాండ్ల విక్రయం చాలా తక్కువగానే ఉంది. కానీ ఎన్నికలు జరగడానికి ముందు మాత్రం అమ్మకాలు ఊపందుకున్నాయి. ఉదాహరణకు 2019 లోక్‌సభ ఎన్నికలకు ముందు రాజకీయ పార్టీలు రూ.2,107 కోట్ల విలువైన బాండ్లను నగదుగా మార్చుకున్నాయి. వీటిలో బీజేపీ వాటా ఏకంగా 84% (రూ.1,770 కోట్లు). ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుందన్న నమ్మకంతో పలు కంపెనీలు



ఆ పార్టీకి విరాళాలు ముట్టజెప్పాయి. ఎన్నికలు ముగిసిన తర్వాత జూలైలో లావాదేవీలు ఒక్కసారిగా పడిపోయాయి. ఆ నెలలో దాతలు కొనుగోలు చేసిన బాండ్ల విలువ కేవలం రూ.45.38 కోట్లే. హర్యానా, జార?ండ్, మహారాష్ట్ర శాసనసభలకు ఎన్నికలు జరగడానికి అప్పటికి ఇంకా ఆరు నెలల సమయం ఉంది.

గత సంవత్సరం అసెంబ్లీ ఎన్నికలు జరిగినప్పుడు కూడా ఎన్నికల బాండ్ల విక్రయం జోరుగా సాగింది. 2023 అక్టోబర్, నవంబర్ నెలల్లో 28, 29 దశల విక్రయాలు జరిగాయి. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మిజోరం, తెలంగాణ, మధ్యప్రదేశ్ శాసనసభ ఎన్నికలకు ముందు వీటి జారీ జరిగింది. గోవా, ఉత్తరాఖండ్, పంజాబ్, మణిపూర్, ఉత్తరప్రదేశ్ శాసనసభ ఎన్నికలకు ముందు 2022 జనవరిలో కూడా బాండ్ల విక్రయం ముమ్మరంగా జరిగింది. ఆ సమయంలో రూ.1,212 కోట్ల విలువైన బాండ్లు అమ్మగా వాటిలో సగం బీజేపీ ఖాతాలో చేరాయి. 2021 జనవరిలో జరిగిన పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ విజయం సాధించింది. ఆ తర్వాత మూడు నెలలకు జరిగిన 17వ దశ బాండ్ల విక్రయంలో తృణమూల్‌కు అత్యధికంగా రూ.107 కోట్లు వచ్చాయి. 2022 ఏప్రిల్‌లో జరిగిన విక్రయాల్లో బీఆర్ఎస్ అత్యధికంగా రూ.410 కోట్లు పొందింది. అప్పటికి తెలంగాణ శాసనసభ ఎన్నికలకు ఇంకా సంవత్సరంన్నర సమయం ఉంది.

### అధిక విరాళాలు ఇచ్చింది వీరే

2021 జూలైలో జరిగిన 17వ దశ బాండ్ల విక్రయాలకు సంబంధించి రాజకీయ పార్టీలు రూ.150.51 కోట్లను నగదుగా మార్చుకున్నాయి. వీటిలో తృణమూల్ రూ.107.06 కోట్లు పొందగా బీజేపీకి వచ్చింది కేవలం రూ.18 కోట్లే. ఈ దశలో ఎక్కువగా విరాళాలు అందించిన సంస్థల్లో ఫ్యూచర్ గేమింగ్ అండ్ హెూటల్ సర్వీసెస్ పీఆర్ (రూ.30 కోట్లు), ఎంకేజే ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (రూ.22.4 కోట్లు), సంజీవ్ గోయంకా నేతృత్వంలోని హల్దియా ఎనర్జీ లిమిటెడ్ (రూ.20 కోట్లు) ఉన్నాయి. 2021 అక్టోబరులో జరిగిన 18వ దశ విక్రయాలను పరిశీలిస్తే%ా%రాజకీయ పార్టీలకు అందిన రూ.614.33 కోట్ల విరాళాల్లో బీజేపీకి వచ్చింది కేవలం పది శాతమే. ఈ దశలో బీఆర్ఎస్‌కు అత్యధికంగా రూ.153 కోట్లు, తృణమూల్‌కు రూ.141.94 కోట్లు, బీజేడీకి రూ.125 కోట్లు, డీఎంకేకు రూ.99 కోట్ల విరాళాలు లభించాయి. ఈ దశలో ఫ్యూచర్ గేమింగ్ (రూ.195 కోట్లు), మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (రూ.100 కోట్లు), ఎస్సెల్ మైనింగ్ అండ్ ఇండిస్టీస్ లిమిటెడ్ (రూ.50 కోట్లు), హల్దియా ఎనర్జీ లిమిటెడ్ (రూ.30 కోట్లు) అత్యధికంగా ఎన్నికల బాండ్లు కొనుగోలు చేశాయి.

### ఓడిన పార్టీలకూ అధిక విరాళాలు

ప్రాంతీయ పార్టీల విషయానికి వస్తే ఎనిమిది దశల్లో తృణమూల్ కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేడీ, వైసీపీ పార్టీలకు ఎక్కువ విరాళాలు అందాయి. బాండ్లలో చాలా వరకూ లోక్‌సభ, శాసనసభ ఎన్నికలకు ముందు కొనుగోలు చేసినవే. అప్పటికే అధికారంలో ఉన్న పార్టీకి లేదా అధికారంలోకి వచ్చే అవకాశం ఉన్న పార్టీకి ఎక్కువగా విరాళాలు అందాయి. ఇందుకు రెండు మినహాయింపులు కూడా ఉన్నాయి. గత సంవత్సరం అక్టోబరులో 28వ దశ బాండ్ల విక్రయం జరిగింది. ఐదు రాష్ట్రాల శాసనసభ ఎన్నికలకు ముందు జరిగిన ఈ అమ్మకాల్లో కాంగ్రెస్‌కు అత్యధికంగా విరాళాలు వచ్చాయి. అయితే ఆ పార్టీ ఒక్క తెలంగాణలోనే విజయం సాధించింది. అదే విధంగా 2022 నవంబరులో హిమాచల్ ప్రదేశ్ శాసనసభ ఎన్నికలకు ముందు బీజేపీకి ఎక్కువ నిధులు వచ్చాయి. కానీ ఆ ఎన్నికల్లో కమలదళం పరాజయం పాలైంది.

# బిగుస్తున్న ఉచ్చు..?

వరంగల్ :ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు ఉచ్చు బిగుస్తుందా? అవుననే అంటున్నారు రాజకీయ విశ్లేషకులు. ఆ దిశగానే విచారణ జరగడాన్ని ఉదాహరణగా చూపుతున్నారు. మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావును అరెస్టు చేసి విచారణ చేస్తున్న నేపథ్యంలో 'ఎర్రబెల్లి'తో సన్నిహితంగా ఇప్పటి వరకు ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి నలుగురు పోలీసు అధికారులను విచారణ అధికారులు తీసుకువెళ్లినట్టు సమాచారం. దీంతో ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ మంత్రి ఎర్రబెల్లి పేరు కూడా ఉండొచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విచారణాధికారులు తీసుకుపోయిన వారిలో గతంలో పాలకుర్తి ఇన్‌స్పెక్టర్లుగా పనిచేసిన అధికారులు ఒడటం గమనార్హం. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పోలీసు అధికారుల పోస్టింగ్‌లు స్థానిక ఎమ్మెల్యే సిఫారసులతోనే జరిగాయని గతంలో వార్తలు వచ్చిన విషయం విదితమే. ఈ క్రమంలో ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎర్రబెల్లి పేరు వినిపిస్తోంది. దాంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. డీఎస్పీ ప్రణీత్‌రావు ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు కావడంతో తెర వెనుక వున్న పెద్దల జాబితాను విచారణ అధికారులు వెలికితీసే ప్రయత్నం చేస్తున్నారు. ఈ వ్యవహారంలో బీఆర్ఎస్ సీనియర్ నేతలు, మాజీ మంత్రుల హస్తం వుండే అవకాశమున్నట్టు ప్రచారం జరుగుతోంది.

### 'ఎర్రబెల్లి' వర్గీయుల్లో ఆందోళన

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఇటీవల తాను పార్టీ మారడం లేదని స్పష్టం చేస్తూ తనపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఖండించారు. ఇదే సందర్భంలో ఫోన్ ట్యాపింగ్ కేసులో తనను ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావుకు 'ఎర్రబెల్లి' స్వగ్రామం పర్వతగిరితో బంధుత్వం ఉంది. ఎర్రబెల్లి వ్యాఖ్యలు ఆయన అనుచరుల్లో, బీఆర్ఎస్ శ్రేణుల్లో కలకలం సృష్టించింది. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి విచారణకు హాజరైన ఆ నలుగురు పోలీసు అధికారులు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు అత్యంత సన్నిహితులని ప్రచారం జరుగుతోంది. దీంతో ఈ కేసులో ఇంకెవరి ప్రమేయం బహిర్గతమవుతుందోనన్న భయాందోళన బీఆర్ఎస్ కార్యకర్తల్లో ఉంది.

### బీఆర్ఎస్‌లో స్తబ్ధత

రాష్ట్రంలో ఇటీవల జరుగుతున్న పరిణామాలు బీఆర్ఎస్‌కు ప్రతికూలంగా మారాయి. ఎమ్మెల్సీ కవిత అరెస్టు కావడంతో ఆ పార్టీలో స్తబ్ధత నెలకొంది. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు ఢిల్లీలోనే మకాం వేశారు. దీంతో పార్టీ నేతలు మౌనంగా వుండిపోయారు. రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణలోనూ అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటుండటంతో ఏ కేసు ఎవరి మెడకు చుట్టుకుంటుందోనన్న భయాందోళన పార్టీ శ్రేణుల్లో వుంది. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, సీఎం రేవంత్‌రెడ్డి మధ్య వున్న రాజకీయ వైరుధ్యం నేపథ్యంలో ఫోన్ ట్యాపింగ్ కేసులో తనను ఇరికిస్తారేమోనన్న ఆందోళనలో వున్నట్టు కనిపిస్తుంది.

# తగ్గేదేలే..

అమరావతి,ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ ఏపీ రాజకీయాలు రోజు రోజుకీ ఆసక్తికరంగా మారుతున్నాయి. ఏడాది మారి ఎన్నికల ఏడాదిలో అడుగు పెట్టగానే వైఎస్ షర్మిల కాంగ్రెస్ లో చేరడంతో రాష్ట్ర రాజకీయాలలో కీలక మలుపుగా చెప్పకతప్పదు. నిజానికి షర్మిల తెలంగాణలో పార్టీ ప్రారంభించిన సమయంలోనో, లేక తెలంగాణ అసెంబ్లీ ఎన్ని కలకు ముందో కాంగ్రెస్ పార్టీలో చేరితే ఇంత ఎఫెక్ట్ కచ్చితంగా కనిపించేది కాదు. కానీ సార్వత్రిక ఎన్నికలకు ముందు, అది కూడా ఏపీ అసెంబ్లీ ఎన్నికలకు కూడా జరగనున్న సమయంలో ఆమె హస్తం గూటికి చేరి అన్నపై విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టడం సంచలనానికి కారణమైంది. ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఆమె పగ్గాలు చేపట్టిన క్షణం నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి, సొంత అన్నపై ఆమె చేస్తున్న విమర్శలు, ఆరోపణలు, జగన్ పాలనలోని అరాచకాలను ఎండగడుతున్న తీరు.. కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఒకింత జోష్ ను పెంచడం అటుంచి.. తాజాగా ఆమె పార్టీ హైకమాండ్ అనుమతిస్తే పులివెందుల బరిలో తన అన్నను ఢీకొనేందుకు సైతం సై అంటూ చేసిన ప్రకటన జగన్ ను, ఆయన పార్టీనీ షేక్ చేసేసిందని చెప్పొచ్చు. అసలు షర్మిల తనకు వ్యతిరేకంగా గళం ఎత్తడం మొదలు పెట్టగానే జగన్ ధైర్యం, స్థైర్యం మటుమాయమైపోయాయి. వాస్తవంగా చెప్పాలంటే.. ఐపాక్ సర్వేలైతేనేమి, జగన్ సొంతంగా చేయించుకున్న సర్వేలైతేనేమి రాష్ట్రంలో వైసీపీ గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నదని తేల్చేశాయి. దీంతో ఓటమి నుంచి తప్పించుకునేందుకు జగన్ ఎన్నో ఎత్తులు వేశారు. వ్యూహాలు రచించారు. వాటిలో జనసేన తెలుగుదేశంతో పొత్తు పెట్టుకోకుండా ఉండేందుకు చేసిన ప్రయత్నాలు ఉన్నాయి. అయితే ఆ ప్రయత్నాలేవీ ఫలించలేదు. రెండు పార్టీలూ సమన్వయంతో పని చేయడమే కాకుండా, సీట్ల సర్దుబాటు విషయంలో కూడా ఇచ్చిపుచ్చుకునే ధోరణిని అవలంబించడంతో ఒకటి రెండు చోట్ల వినా ఎక్కడా ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండానే తెలుగుదేశం, జనసేనల మైత్రీ బంధం బలపడింది. ఇక ఆ కూటమితో బీజేపీ కలవకుండా ఉండేందుకు జగన్ చేసిన ప్రయత్నాలూ బెడిసికొట్టాయి. సిట్టింగుల మార్పుతో తన ప్రభుత్వంపై అసంతృప్తిని తగ్గించుకోవాలన్న ప్రయత్నాలు బూమరాంగ్ అయ్యాయి. సిట్టింగులపై అసంతృప్తి కంటే జగన్ పాలనపైనే ప్రజలలో ఆసంతృప్తి, ఆగ్రహం ఉన్నాయని తేటతెల్లం చేస్తూ పార్టీలో అసమ్మతి భగ్గుమంది. ఇన్ని ఇబ్బందులలోనూ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తూ వైనాట్ 175 అంటే బింకంగా విపక్ష కూటమిపై అనుచిత విమర్శలను ప్రోత్సహిస్తూ గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్న జగన్ కు షర్మిల ఏపీ పాలిటిక్స్ లోకి ఎంట్రీ ఇవ్వడం మాత్రం నోరు పెకలని పరిస్థితిలోకి నెట్టి వేసింది. సొంత సోదరి అని కూడా చూడకుండా వైసీపీ సమాజిక మాధ్యమంలో షర్మిల వ్యక్తిగత జీవితంపై కూడా ఇష్టారీతిన పోస్టులను ప్రోత్సహించిన జగన్ కు షర్మిల నేరుగా తనపైనే తలపడతానంటూ విసిరిన సవాల్ తో మైండ్ బ్లాక్ అయిపోయింది. ధైర్యం, స్థైర్యం సన్నగిల్లింది. సొంత అడ్డాలోనే అడుగుపెట్టడానికి బెదిరే పరిస్థితిలో జగన్ పడిపోయారు. గత ఎన్నికలలో జగనన్న విజయం కోసం శక్తికి మించి కష్టపడిన షర్మిల ఇప్పుడు ఆయనకు బద్ధ శత్రువుగా, పక్కలో బల్లెంగా మారింది. జగన్ ను ఉద్దేశించి నేరుగా, సూటిగా ఆమె చేస్తున్న విమర్శలు వైసీపీలో కాకపుట్టిస్తున్నాయి. కడప లోక్ సభ బరిలో షర్మిల దిగనున్నారన్న వార్తలు వైసీపీలో అంతంత మాత్రంగా ఉన్న గెలుపు ఆశలను ఆవిరి చేసేశాయి. అది చాలదన్నట్లు తాజాగా షర్మిల అధిష్ఠానం ఆదేశిస్తే జగన్ ప్రత్యర్థిగా పులివెందుల అసెంబ్లీ బరిలోనైనా నిలవడానికి రెడీ అన్న ప్రకటన జగన్ ను పూర్తిగా డీలా పడేలా చేసింది. వాస్తవానికి ఏపీ కాంగ్రెస్ పగ్గాలు చేపట్టిన నాటి నుంచీ షర్మిల తన అన్న, సీఎం జగన్ పై విమర్శలు గుప్పిస్తూనే ఉన్నారు. జగన్ ప్రభుత్వ అరాచకాలను ఎత్తి చూపుతూనే ఉన్నారు. ఇప్పుడు తాజాగా ఆమె పులివెందుల గడ్డపై జగన్ తో ఢీకొంటానని చేసిన ప్రకటనపై అధిష్ఠానం సానుకూలంగా స్పందిస్తుందో లేదో చూడాలి. నిజానికి షర్మిల కడప లోక్ సభ బరిలో నిలిచినా, ఆ ప్రభావం పులివెందుల లో జగన్ విజయావకాశాలపై తీవ్రంగా ఉంటుందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. అలాంటిది షర్మిల నేరుగా తన అన్నకు ప్రత్యర్థిగా పులివెందుల అసెంబ్లీ నియోజ కవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తే జగన్ పరిస్థితి అగమ్యగోచరంగా మారడం ఖాయమని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. పార్టీ అధినేతగా రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి వైసీపీ అభ్యర్థుల విజయం కోసం ప్రచారం చేయాల్సిన జగన్ పులివెందులకే పరిమితం కావాల్సిన పరిస్థితి ఏర్పడుతుందనీ, అలా పరిమితమైనా

# పోర్టుల ప్రైవేటీకరణతోనే డ్రగ్స్ సరఫరా

అమరావతి,విశాఖపట్నం పోర్టులో డ్రగ్స్ పట్టుపడటంపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తీవ్రంగా స్పందించారు. పోర్టులు ప్రైవేటుపరం చేయటమే మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు కారణమని ఆరోపించారు. గతంలో గుజరాత్‌లోని ముంద్రా పోర్టులో విజయవాడ చిరునామాతో వేల కోట్ల విలువైన హెరాయిన్ దొరకటం గమనార్హమన్నారు. డ్రగ్స్ రాకెట్ వెనుక అధికార వైసీపీ నేతలు, పలువురు అధికారుల హస్తం ఉన్నట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయని తెలిపారు. ఏపీలో గంజాయి హవా తీవ్రంగా కనిపిస్తోందన్నారు. ఏపీలో గంజాయి, డ్రగ్స్ కలకలం యువత భవితకు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. డ్రగ్స్ సరఫరాపై సమగ్ర విచారణ జరిపి, దోషులెంతటివారైనా కఠినంగా శిక్షించాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. డ్రగ్స్ పట్టివేతపై సమగ్ర విచారణ జరిపి, కారకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లక్షల కోట్ల విలువైన డ్రగ్స్ విశాఖ పోర్టులో పట్టుబడటం ఆందోళనకరమన్నారు. కాగా.. విశాఖ కేంద్రంగా డ్రగ్స్ రవాణా తీవ్ర కలకలం రేపింది. లాసన్స్‌బే కాలనీలో గల సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్టర్స్ ప్రైవేటు లిమిటెడ్ అనే సంస్థ బ్రెజిల్ నుంచి 'డ్రై ఈస్ట్' పేరుతో ఒక కంటెయినర్ తెప్పించుకోగా అందులో కొకైన్ ఉందని నిర్ధారణ అయ్యింది. బ్రెజిల్ నుంచి విశాఖపట్నం వస్తున్న కంటెయినర్‌లో 25వేల కిలోల ఈస్ట్‌తో పాటు డ్రగ్స్ వస్తున్నాయని ఇంటర్‌పోల్ నుంచి ఈ నెల 18న సీబీఐకి సమాచారం వచ్చింది. అప్పటికి రెండు రోజుల ముందే ఆ నౌక ఇక్కడి కంటెయినర్ టెర్మినల్‌కు చేరింది. సీబీఐ అధికారులు మరుసటిరోజే మంగళవారం లాసన్స్‌బే కాలనీలోని సంధ్య ఆక్వా ఆఫీసుకు వెళ్లి కంటెయినర్‌పై అనుమానాలు ఉన్నాయని విచారణకు రావాలని కోరారు. విజిలెన్స్ అధికారులను కూడా తీసుకువెళ్లారు. సంధ్య సంస్థ తరపున వైస్ ప్రెసిడెంట్ ఆర్‌వీఎల్‌ఎన్ గిరిధర్, ఆయనతో పాటు తోడుగా పూరీ శ్రీనివాస కృష్ణమాచార్య శ్రీకాంత్, కె.భరత్ కుమార్‌లు వెళ్లారు. మంగళవారం మధ్యాహ్నం 12.30 గంటలకు అందరి ముందు కంటెయినర్‌ని తెరిచారు. అందులో ఒక్కోటి 25 కేజీల బరువున్న వేయి సంచులను 20 పాలెట్లలో సర్దారు. ఒక్కో పాలెట్ నుంచి ఒక సంచిని సీబీఐ అధికారులు పరీక్షించారు. వాటిలో మత్తు పదార్థం 'కొకైన్' ఉన్నట్టు పరీక్షల్లో తేలింది.

# విశాఖ పోర్టులో అధికారులకు ఏం పని

అమరావతి,విశాఖపట్టణం పోర్టులో ఏపీ సీనియర్ అధికారులకు ఏంపని అని టీడీపీ అధికార ప్రతినిధి పట్టాభిరాం ప్రశ్నించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై ఫైర్ అయ్యారు. జగన్ మోచేతినీళ్లు తాగే అధికారులకు అక్కడ ఏం పని అని ఆయన నిలదీశారు. సీబీఐ అధికారులు తనిఖీలు చేస్తుంటే వారు ఎందుకు అడ్డుకున్నారని పట్టాభి ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్రెజిల్ నుంచి విశాఖపట్నం వస్తున్న కంటెయినర్‌లో 25 వేల కిలోల ఈస్ట్‌తో పాటు డ్రగ్స్ వస్తున్నాయని ఇంటర్‌పోల్ నుంచి ఈ నెల 18న సీబీఐకి సమాచారం వచ్చింది. అప్పటికి రెండు రోజుల ముందే ఆ నౌక ఇక్కడి కంటెయినర్ టెర్మినల్‌కు చేరింది. సీబీఐ అధికారులు మరుసటిరోజే లాసన్స్‌బే కాలనీలోని సంధ్య ఆక్వా ఆఫీసుకు వెళ్లి కంటెయినర్‌పై అనుమానాలు ఉన్నాయని విచారణకు రావాలని కోరారు. విజిలెన్స్ అధికారులను కూడా తీసుకువెళ్లారు. సంధ్య సంస్థ తరపున వైస్ ప్రెసిడెంట్ ఆర్‌వీఎల్‌ఎన్ గిరిధర్, ఆయనతో పాటు తోడుగా పూరీ శ్రీనివాస కృష్ణమాచార్య శ్రీకాంత్, కె.భరత్‌కుమార్‌లు వెళ్లారు. మంగళవారం మధ్యాహ్నం 12.30 గంటలకు అందరి ముందు కంటెయినర్‌ని తెరిచారు. అందులో ఒక్కోటి 25 కేజీల బరువున్న వేయి సంచులను 20 పాలెట్లలో సర్దారు. ఒక్కో పాలెట్ నుంచి ఒక సంచిని సీబీఐ అధికారులు పరీక్షించారు. వాటిలో మత్తు పదార్థం 'కొకైన్' ఉన్నట్టు పరీక్షల్లో తేలింది.

# సీనియర్లు గల్లంతు..

విజయవాడ : తెలుగుదేశం పార్టీ లోక్‌సభ, అసెంబ్లీకి చెందిన అభ్యర్థుల మూడో జాబితాని శుక్రవారం ఉదయం రిలీజ్ చేసింది. జనసేన, బీజేపీతో పొత్తు నేపథ్యంలో తాము గెలవాల్సిన సీట్లల్లో అభ్యర్థుల ఎంపికలో పార్టీ అధినేత చంద్రబాబు ఆచీతూచీ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఇప్పటి వరకూ రెండు జాబితాలను అధిష్టానం విడుదల చేయగా, నిన్న జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌తో చర్చల అనంతరం మూడో జాబితాను శుక్రవారం బాబు విడుదల చేశారు. ఈ జాబితాలో 13 మందితో లోక్‌సభ అభ్యర్థుల పేర్లను ప్రకటించారు. మరో నాలుగు స్థానాల్లో అభ్యర్థుల ఎంపిక పెండింగ్‌లో పెట్టారు. అలాగే.. 11 అసెంబ్లీ స్థానాలను కూడా చంద్రబాబు ఈ జాబితాలో వెల్లడించారు. దీంతో ఎన్నికల బరిలో నిలబడే టీడీపీ అభ్యర్థుల సంఖ్య 137 కు చేరింది. కనీసం ఈ జాబితాలో సీట్ల పైన ఆశలు పెట్టుకున్న సీనియర్ లీడర్లు దేవినేని ఉమా, గంటా శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణమూర్తి, కళా వెంకట్రావు పేర్లు కనపడలేదు. దీంతో సీనియర్లలో ఆందోళన కనిపిస్తోంది.

అక్కడ మతాబులు ఇక్కడ మంటలు

టీడీపీ మూడోవ జాబితా విడుదల అనంతరం గుంటూరు, కృష్ణా జిల్లాల్లో టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం కనిపించగా.. మరో వైపు సీటు దక్కని నేతల అనుచర వర్గం ఆందోళన, ఆగ్రహంతో రగిలిపోతోంది. నరసరావుపేటలో డాక్టర్ అరవింద బాబుకు టిక్కెట్టు ఇవ్వాల్సిందేనని టీడీపీ శ్రేణులు రెండు రోజులుగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రామిరెడ్డి అనే టీడీపీ కీలక నేత ఏకంగా ఆత్మహత్యకు యత్నించారు. పైగా ఎంపీ అభ్యర్థి లావు కృష్ణదేవరాయలకు వ్యతిరేక వ్యాఖ్యలు చేశారు. ఎట్టకేలకు డాక్టర్ అరవిందు బాబుకు టిక్కెట్టు ఖరారు చేయటంతో స్థానిక కార్యకర్తలు బాణాసంచా కాల్చారు. ఇక నిన్నటి వరకూ కుతకుతలాడిన పెనంలూరు.. చల్లారి పెనమలూరుగా మారింది. తనకు టిక్కెట్లు వస్తుందో రాదోనని మాజీ ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ఎంతో మధనపడ్డారు. ఒకసారి దేవినేని ఉమామహేశ్వరరావు పేరు, మరో సారి ఆలపాటి రాజా పేరు తెరమీదకు రావటంతో నియోజకవర్గంలో టీడీపీ శ్రేణులు ఖిన్నులయ్యారు. ఇలాంటి స్థితిలో బోడే ప్రసాద్ కే టిక్కెట్టు ఖరారు కావటంతో.. పెనమలూరు టీడీపీ శ్రేణులు ఇక గెలుపు మాదే అంటూ సంబరాలు చేస్తున్నారు.

మైలవరంలో మంటలు

మైలవరం టిక్కెట్టు వసంత కృష్ణ ప్రసాద్ కే దక్కటంతో ఇటు మాజీ మంత్రి దేవినేని ఉమమహేశ్వరరావు,అటు స్థానిక నేతలు బొమ్మసాని సుబ్బారావు, గన్నే ప్రసాద్ వర్గాలు నిరుత్సాహపడ్డాయి.ముఖ్యంగా ఎట్టి పరిస్థితిలోనూ చివరి క్షణం లోనైనా అధిష్టానం కరుణిస్తుందని ఆశించిన మాజీ మంత్రి దేవినేని ఉమా బిక్క చచ్చిపోయారు.టిక్కెట్టు కోరిన వర్గం వసంత కృష్ణ ప్రసాద్తో పని చే యటానికి అంగీకరించటం లేదు.ఉమా వర్గీయులైతే ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు.అధిష్టానం ఈ వర్గాలను ఏరీతిలో సముదాయిస్తుందో వేచి చూడాల్సిందే.

శ్రీకాకుళంలో అగ్గి మీద గుగ్గిలం

శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గం స్థానాన్ని మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత

# ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కింగ్‌పిన్ కేజ్రీవాల్



న్యూఢిల్లీ,ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కింగ్‌పిన్ కేజ్రీవాల్ అని ఇడి అధికారులు తెలిపారు. ఇది కేవలం వందకోట్ల వ్యవహారం కాదని, లంచాల్లో భాగస్వామ్యం కూడా తోడు కావడంతో ఈ మొత్తం కనీసం 600కోట్లు ఉంటుందని ఇడి కోర్టుకు తెలియచేసింది. గురువారం రాత్రి అరెస్టయిన ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను రౌస్ అవెన్యూ కోర్టులో ఈడీ అధికారులు ప్రవేశపెట్టారు. ఈ కేసులో ప్రశ్నించేందుకు కేజ్రీవాల్‌ను 10 రోజులపాటు కస్టడీకి అప్పగించాలని జడ్జిని ఈడీ కోరింది. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో నిందితుడిగా ఉన్న అరవింద్ కేజ్రీవాల్‌ను గురువారం రాత్రి 9:05 గంటలకు అరెస్టు చేశామని, 24 గంటల్లోపు అతడిని జడ్జి ముందు హాజరుపరిచినట్టు ఈడీ పేర్కొంది. రిమాండ్ కోరుతూ దరఖాస్తు ఇచ్చామని, అన్ని నిబంధనలను పాటించి కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేశామని ఈడీ అధికారులు కోర్టుకు వెల్లడించారు. కేజ్రీవాల్ అరెస్టుపై బంధువులకు కూడా సమాచారం అందించామని, అరెస్టుకు సంబంధించిన ఆధారాలను 28 పేజీల్లో రాతపూర్వకంగా అందజేశామని వివరించారు. అరెస్టు పంచనామా కూడా తమ వద్ద ఉందని ఈడీ తరపు న్యాయవాదులు కోర్టుకు వెల్లడించారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో సీఎం అరవింద్ కేజ్రీవాల్ కీలకమైన వ్యక్తి అని, కొందరు వ్యక్తులకు మేలు చేసేందుకు డబ్బులు అడిగారని రౌస్ అవెన్యూ కోర్టుకు ఈడీ వెల్లడించింది. అక్రమ మార్గంలో వచ్చిన ఈ డబ్బుని గోవా ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ఉపయోగిం చిందని పేర్కొంది. మద్యం విధానం రూపకల్పనలో కేజ్రీవాల్‌కు ప్రత్యక్ష పాత్ర ఉందని, స్కామ్‌లో ప్రధాన వ్యక్తి ఆయనేనని తెలిపింది. ఇక ఈ కేసులోనే అరెస్టయిన ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం, ఆప్ నేత మనీష్ సిసోడియా బెయిల్ లభించలేదని న్యాయస్థానం దృష్టికి ఈడీ పేర్కొంది. ఈ కేసులో సహ నిందితురాలుగా ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వాంగ్మూలాన్ని కూడా తీసుకున్నామని ప్రస్తావించింది. ఆప్ మాజీ కమ్యూనికేషన్స్ ఇన్‌ఛార్జ్ విజయ్ నాయర్ సీఎం అరవింద్ కేజ్రీవాల్ వద్ద పనిచేస్తున్నారని, కేజ్రీవాల్‌తో చాలా సన్నిహితంగా ఉండే విజయ్ నాయర్ మధ్యవర్తిగా వ్యవహరించాడని ఈడీ పేర్కొంది. సౌత్ గ్రూప్ నుంచి కేజ్రీవాల్ డబ్బు డిమాండ్ చేశారని, ఈ విషయాన్ని నిరూపించడానికి తమ వద్ద ఆధారాలు ఉన్నాయని ఈడీ తరపు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. రెండు పర్యాయాలు నగదు బదిలీ జరిగిందని వివరించారు.

సౌత్ గ్రూప్‌కు లిక్కర్ పాలసీలో లబ్ది చేకూర్చేందుకు ముడుపులు తీసుకున్నారని వివరించారు. లిక్కర్ పాలసీ రూపకల్పనలో భాగంగా ఎమ్మెల్సీ కవితను కేజ్రీవాల్ కలిశారని, కలిసి పని చేద్దామంటూ కవితతో సీఎం కేజ్రీవాల్ చెప్పారని ఈడీ పేర్కొంది. విజయ్ నాయర్ అరవింద్ కేజ్రీవాల్ కోసం పనిచేశారని, గోవా ఎన్నికల సమయంలో రూ.45 కోట్లు చేతులు మారాయని కోర్టుకు ఈడీ వెల్లడించింది. ఈ కేసుకు సంబంధించిన ఆధారాలలో ఫోన్ రికార్డ్స్ కూడా ఉన్నాయని రౌస్ అవెన్యూ కోర్టుకు ఈడీ తెలిపింది. విజయ్ నాయర్‌కు సంబంధించిన కంపెనీ నుంచి ఆధారాలు సేకరించామని, రూ.45 కోట్లు హవాలా మార్గంలో తరలించినట్టు తేలిందని, పెద్ద మొత్తంలో నిధులు వివిధ వ్యక్తుల ద్వారా చేతులు మారాయని వివరించింది. మద్యం కుంభకోణం కేసులో దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కీలక సూత్రధారి అని ఈడీ ఆరోపించింది. 'సౌత్ గ్రూప్' సంస్థకు, నిందితులకు మధ్య ఆయన మధ్యవర్తిగా వ్యవహరించారని పేర్కొంది. మద్యం కుంభకోణంలో అరవింద్ కేజ్రీవాల్ కింగ్‌పిన్. దిల్లీ ఎక్సైజ్ పాలసీ రూపకల్పన, అమలుకు 'సౌత్ గ్రూప్' సంస్థ నుంచి రూ.కోట్ల ముడుపులు అందుకున్నారు. పంజాబ్ ఎన్నికల కోసం ఆ సంస్థకు చెందిన కొందరు నిందితుల నుంచి రూ.100 కోట్లు డిమాండ్ చేశారు. రూ.45 కోట్ల ముడుపులను గోవా ఎన్నికల్లో ఉపయోగించారు. అవి నాలుగు హవాలా మార్గాల నుంచి వచ్చాయని ఈడీ తరఫు న్యాయవాదులు వాదించారు. అయితే ఇడి వాదనలను కేజ్రీవాల్ అడ్వకేట్ మను సింఘ్వి తీవ్రంగా ఖండించారు. ఆధారాలు లేని కేసులో అరెస్ట్ చేశారని అన్నారు. ఆధారాలు ఉంటే కస్టడీ ఎందుకని ప్రశ్నించారు.

# అల పిఠాపురంలో పవన్ విజయం ఏకపక్షమేనా!!!

విజయవాడ :ఏపీలో ఎన్నికల్లో తూర్పు గోదావరి జిల్లా పిఠాపురంలో పొలిటికల్ వార్ హాట్ టాపిక్ గా మారింది. అభినవ, అభినయ గోపాలుడి పాత్రలో చిటికిన వేలుపై కేంద్ర, రాష్ట్ర రాజకీయాలను గిరి గిర తిప్పుతున్న జనసేన సైన్యాధిపతి పవన్ కళ్యాణ్ ఈ బరిలో దిగటంతోనే%ూ% ఏపీ రాజకీయాల్లో ఎనలేని వేడి రగిలింది. ఆయనపై వంగా గీత అనే మహిళ నేత వైసీపీ బాణంగా దూసుకు వస్తుంటే.. ఆ అస్త్రాన్ని పవన్ కళ్యాణ్ తిప్పికొడతారా? లేక కూలపడతారా? అనే అంశాలపై ఏపీలో బెట్టింగ్ రాయుళ్లు ఉవ్విళ్లూరుతున్నారు. ఇద్దరు అభ్యర్థులు భారీ మెజారిటీ ఖాయమని తెగేసి చెబుతుంటే.. పిఠాపురం ప్రజల మనోగతి ఎలా ఉంది? పవన్ గాలితో చేదతీరుతారా? లేక ఫ్యాన్ గాలితో పవన్ కళ్యాణ్కు దిమ్మతిరిగే షాక్ ఇస్తారా? అంచనాలకు అందని ఊహాగానాల్లో రాజకీయ పండితులు సతమతమవుతున్నారు.నిజం..నిజంగా నిజం. పిఠాపురంలో ఎన్నికల పోరు ఏక పక్షమా? హోరాహోరీ పోరా? అనే అంశం రాజకీయ పరిశీలకులకు అర్థం కావటం లేదు. ఎందుకంటే ఈ సారి భీమవరం నుంచే పవన్ కళ్యాణ్ పోటీ చేస్తారనే అంచనాలను తలకిందులు చేస్తూ.. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పిఠాపురం నుంచే పోటీ చేయటానికి నిర్ణయం తీసుకోవటంతో .. ఈ సీటుకు అనూహ్య వెయిటేజీ పెరిగింది. పొలిటికల్ హీట్ పెరిగింది. ఎందుకంటే పిఠాపురం నియోజకవర్గంలో 2.30 లక్షల పైగా ఓట్లు ఉంటే,,, ఇందులో ఏకంగా 91,000 ఓట్లు కాపు సామాజిక వర్గానివే. అంటే నలభై శాతానికి పైగా ఒకే సామాజిక వర్గం ఓట్లు ఉన్నాయన్నమాట. మొదటి నుంచి పిఠాపురంలో కాపులదే రాజ్యం. పార్టీలు వేరు అయినా సామాజిక వర్గం మాత్రం అదే కావడం విశేషం.ఇక 1952 నుంచి ఎన్నికల సరళిని పరిశీలిస్తే అన్ని ఎన్నికలూ ఆసక్తి కరమే. అంతే కాదు హోరా హోరీ పోరుతో సాగినవే. ఇక మెజారిటీలు చూస్తే ఎపుడూ ఇరవై వేలను పై దాటినవి లేవు. కానీ 2014లో మాత్రం ఏకంగా 47, 800 ఓట్ల మెజారటీ వచ్చింది. ఈ మెజారిటీని గత చరిత్రలో సాధించలేదు. పిఠాపురంలో ఇప్పటికి పదహారు సార్లు ఎన్నికలు జరిగితే ఎవరికీ ఇందులో సగం మెజారిటీ కూడా దక్కలేదు. కానీ పిఠాపురం నుంచి క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన ఎస్వీఎస్ ఎన్ వర్మ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి బంపర్ మెజారిటీ విజయం సాధించారు. నిజానికి ఆనాడు టీడీపీ, వైసీపీలను పక్కన పెట్టి మరీ వర్మ గెలవటం చారిత్రాత్మక విజయమే. ఐతే, ఇంత పెద్ద సామాజిక వర్గంలోనూ తీవ్ర పోటీ ఉందనేది నిర్వివాదాంశం. కాపులు కాపులకే మద్దతు ఇస్తారంటే.. అది కేవలం ఊహాగానమే. ప్రజలకు ఎవరు నచ్చితే వారికే కులాలకతీతంగా మద్దతు పలుకుతారని పిఠాపురం జనం నిరూపించారు.

గతంలో కాపుల మధ్యే తీవ్ర పోటీ

పిఠాపురం రాజకీయ చరిత్రలో కాపు సామాజికవర్గం భిన్న ధృవాలుగా పోటీపడిన వైనమే కనిపిస్తున్న స్థితిలో ఇపుడు పవన్ కళ్యాణ్కు లక్ష మెజారిటీ ఖాయం అని జనసేన సైనికులు అంటున్నారు. పవన్ కళ్యాణ్ సైతమూ లక్షకు మెజారిటీ తగ్గకూడదు అని అంటున్నారు. ఇక్కడ ఒకటే అస్త్రం ఈ ఒక్కసారి మన మనిషిని రాష్ట్ర రాజకీయాల్లో కీలకం చేయాలనే అభిలాషే ఈ సామాజిక వర్గంలో విస్తృతంగా వ్యాపిస్తోంది. ఎట్టి పరిస్థితిలోనూ భీమవరం, గాజువాక చరిత్ర పునరావృతం కాకూడదని జనసేన వర్గం ప్రచారం చేస్తోంది. మరి అదే నిజం అవుతుందా లేక మెజారిటీలు మారుతాయా లేక ప్లాన్ బీ ఫలించి వైసీపీ నెగ్గుతుందా అనేది సమాధానం లేని ప్రశ్న.వైసీపీ నుంచి వంగా గీత పోటీ చేస్తున్నారు. ఆమె 2009లో వేయి ఓట్ల తేడాతోనే ప్రజారాజ్యం పార్టీ నుంచి గెలిచారు. ఈ ఎన్నికల్లో కాపుల నేత ముద్రగడ పద్మనాభం, క్షత్రియ నేత వర్మ కూడా పోటీ చేశారు. ఇందులో వంగా గీతకు 46,423 ఓట్లు, ముద్రగడ పద్మనాభానికి 43,431 ఓట్లు, వర్మకు 45,587 ఓట్లు వచ్చాయి. అంటే ఈ ఎన్నికల్లో 80 వేల కాపుల ఓట్లు దాదాపు సరిసమానంగా విడిపోయాయని రాజకీయ పరిశీలకుల అంచనా. ఇక 2014లో వైసీపీ అభ్యర్థిపై వర్మ 45వేల ఓట్ల మెజారిటీ గెలిచినా.. 2019లో దొరబాబుపై 14,992 ఓట్ల మెజారిటీతో ఓడిపోగా.. జనసేనకు 28011 ఓట్లు వచ్చాయి.

ఈసారి ఏకపక్షమేనా..

అయితే .. 2024లో పవన్ కళ్యాణ్ గెలుపు ఎంత నిజమో టమి అంతే నిజమని వైసీపీ వాదిస్తోంది. పైగాఈసారి తాను బంపర్ మెజారిటీతో గెలిచి తీరుతానని వంగ గీత సవాల్ విసురుతున్నారు. దీనికి తోడు పిఠాపురంపై మొత్తం బలగాలతో వైసీపీ మోహరిస్తోంది. భారీ వ్యూహ రచన చేస్తోంది. పవన్ కళ్యాణ్ను ఒక మహిళతో ఓడించాలన్న పంతంతో పనిచేస్తోంది. బీసీలను ఎస్సీలను ఇతర



సామాజిక వర్గాలను తన వైపుకు తిప్పుకుంటోంది. మరి వైసీపీ వర్సెస్ జనసేన పోరులో ఎవరు నెగ్గుతారు. ఎవరు అత్యధిక మెజారిటీ సాధిస్తారు అన్నది ఉత్కంఠను రేపుతోంది. పిఠాపురంలో వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే పెండెం దొరబాబు సీటు గల్లంతు కావటం, ఎంపీ స్థానం నుంచి వంగ గీతను రంగంలోకి దించటం వైసీపీకి పెద్ద మైనస్ పాయింటే. గత ఎన్నికల పోలింగ్ సరళితో బేరీజు వేస్తే%ూ% పవన్ కళ్యాణ్ గెలవటం తథ్యం.. ఎందుకంటే.. ఆయన గెలుపు బాధ్యతను వర్మ భుజానికి ఎత్తటంతో.. పిఠాపురంలో పవన్ కళ్యాణ్ పోరాటం ఏకపక్షమేనని రాజకీయ పరిశీలకులు అంచావేస్తున్నారు.

పవన్ ఓటమే వైసీపీ టార్గెట్

పిఠాపురంలో పవన్ కళ్యాణ్ ఓటమే వైసీపీ ప్రధాన లక్ష్యం కావటంతో ఇక్కడ వైసీపీ అభ్యర్థి వంగా గీతను గెలిపించటమే ఈ కీలక నేతల బాధ్యత. ఇటీవల వైసీపీలో చేరిన కాపునేత ముద్రగ్రడ పద్మనాభం క్యాంపెయిన్ స్టార్ కాగా.. మరో ముగ్గురు కీలక నేతలను ఇంచార్జులుగా వైసీపీ నియమించింది. పిఠాపురం మండలం బాధ్యతలను ఎంపీ మిథున్ రెడ్డికి.. కొత్తపల్లి మండలానికి మంత్రి దాడిశెట్టి రాజా..గొల్లప్రోలు మండలం బాధ్యతలు మాజీ మంత్రి కన్నబాబు.. నియోజకవర్గంలో కాపు సామాజిక వర్గాన్ని వైసీపీ వైపు తిప్పే బాధ్యతలు ముద్రగడకు.. వీరు ముగ్గురే కాక.. నియోజకవర్గానికి ప్రత్యేక ఇంచార్జ్‌గా ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి.. ఒక్కో నేతకు ఒక్కో టాస్క్.. మండలాల ఇంచార్జ్‌లు అన్ని వర్గాలతో చర్చలు జరపడం.. ఆ మండలాల్లో వైసీపీకి సానుకూల పరిస్థితులుగా మార్చడం..ఆర్థికపరమైన అంశాలను చూసుకునేందుకు ద్వారంపూడి..ఇక కాపు నేతలను సముదాయించే పని ముద్రగడకు.. ఇలా సరికొత్త వ్యూహంతో పవన్‌కు షాక్ ఇచ్చేందుకు గ్రౌండ్‌ను ప్రిపేర్ చేస్తున్నారు..అటు జనసేన, ఇటు వైసీపీ కూడా ఆపరేషన్ ఆకర్ష్‌కు తెరలేపారు పిఠాపురంలో.. ఏకంగా వైసీపీ అభ్యర్థి వంగా గీతను జనసేనలో చేరాలని పవన్ కళ్యాణ్ ఆహ్వానించారు. కానీ వైసీపీ మాత్రం జనసేన, టీడీపీ నేతలను చేర్చుకునేందుకు రంగం సిద్ధం చేసింది.. ఇదంతా పవన్‌కు భయపడి చేస్తున్నారా? లేదంటే ఎలాగైనా ఓడించాలనే కసితో చేస్తున్నారా? మరి ఏ పార్టీ వ్యూహం ఫలిస్తుంది? ఏ పార్టీ గెలుస్తుంది? ఇవీ రాజకీయ విశ్లేషకుల ప్రశ్నలు .

పొత్తుల బలమే కాదు..తటస్థ ఓటర్లే దేవుళ్లు

2019 పిఠాపురం అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం ఓట్లు – 1,86,682 (83 శాతం) పోల్ అయ్యాయి. వైసీపీ –అభ్యర్థి పెండెం దొరబాబుకు – 83,459 (44 శాతం) ఓట్లు, టీడీపీ –అభ్య ర్థి ఎస్వీఎస్ఎస్ వర్మ – 68,467 (36 శాతం) ఓట్లు, జనసేన పార్టీ అభ్యర్థి – మాకినీడి శేషు కుమార్ – 28,011 (15 శాతం) ఓట్లు వచ్చాయి. 14,992 ఓట్ల మెజారిటీతో దొరబాబు గెలిచారు. అంటే గత ఎన్నికల్లో టీడీపీకి 36 శాతం, జనసేనకు 15 శాతం ఓట్లు వచ్చాయి. ఈ రెండూ ఆయా పార్టీల అసలు ఓట్లే. అంటే ఈ రెండు పార్టీలు కలిస్తే 51 శాతం ఓట్లు ఖాయంగా కనిపిస్తున్నాయి. ఇక బీజేపీ తోడు కావటంతో.. ప్రభుత్వ వ్యతిరేక ఓటు కలవటంతో విజయం ఖాయమని జనసైనికులు అంచనా వేస్తూ.. భారీ మెజారిటీ టార్గెట్ పెట్టుకున్నారు. ఇక కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రంగంలోకి దిగితే ఓటు బ్యాంకు చీలే పరిస్థితి లేదు. ఎందుకంటే.. ఇక్కడ కాంగ్రెస్ వాదులు వైసీపీకే గతంలో ఓటు వేశారు. ఈ సారి వైసీపీ నుంచి ఓట్లు చీలితే.. అవి కాంగ్రెస్ పార్టీవే.. అని రాజకీయ విశ్లేషకుల అంచనా. ఎనీ హౌ%ూ% పిఠాపురం కాపు క్రాస్ ఓటింగ్ పై వైసీపీ ఎన్ని ఆశలు పెట్టుకున్నా%ూ% ఈ బలం తమదేనని జనసేన మితిమీరిన ఆత్మవిశ్వాసంతో లక్ష మెజారిటీ లక్ష్యంతో అడుగులేసినా,, .. తటస్థ ఓటర్లే ఈ రెండు పార్టీలకు కనిపించని దేవుళ్లంటే ..అంగీకరించక తప్పదు.

# జలమే మానవాళికి జీవనాధారం

బెంగళూరు,బెంగళూరులో నీటి సమస్య తీవ్రం కావడంతో మనమెంతగా దూరదృష్టి లేకుండా మనుగడ సాగిస్తున్నామో అర్థం చేసుకోవచ్చు. నీటి వనరులను ధ్వంసం చేయడం, చెరువుల, కాలువను ధ్వంసం చేయడం వల్ల తీరని నీటి సమస్యను ఎదుర్కొంటున్నాం. తాగడానికి నానా తంటాలు పడుతున్నాం. కర్నాటక పరిస్థితులు మనకు ఓ హెచ్చరిక కావాలి. నీరు లేనిదే సమస్త జీవ కోటికి మనుగడ లేదు. అసలు జీవ పరిణామం ప్రారంభమైందే సముద్ర గర్భంలో అనే విషయం తెలిసిందే. ఒకప్పుడు పుష్కలంగా లభించే మంచి నీటిని అభివృద్ధి పేరిట కలుషితం చేస్తున్నాం. అవసరానికి మించి వాడుతూ వాటిని వృథా చేస్తున్నాం. దీంతో సమీప భవిష్యత్తులో నీటి కోసం యుద్ధాలు జరిగే రోజులు కూడా రానున్నాయనడంలో ఆశ్చర్యమేమీ లేదంటే అతిశయోక్తి కాదేమో. ఈ పరిస్థితి రాకూడదనే ఉద్దేశంతోనే ఐక్యారాజ్య సమితి 'ప్రపంచ జల దినోత్సవం' అంటే వరల్డ్ వాటర్ డే ను నిర్వహిస్తున్నది. ప్రతియేటా మార్చి 22న దీనిని ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. వరల్డ్ వాటర్ డే.. పది ఆసక్తికర విషయాలు గగమనించాలి. ప్రపంచంలో నేడు ప్రతి ముగ్గురిలో ఒకరికి శుద్ధమైన తాగునీరు దొరకడం లేదు. 2050 నాటికి భూమి మీద నివసిస్తున్న వారిలో సుమారు 5.7 బిలియన్ల అంటే 500 కోట్ల మంది సంవత్సరానికి ఒక నెల పాటు నీటి కొరత ఎదుర్కొన నున్నారని అంచనా. మంచి నీటి సరఫరా, పారిశుధ్యం సక్రమంగా ఉంటే ప్రతి యేటా 3,60,000 వేల మంది శిశువుల ప్రాణాలను కాపాడుకోవచ్చు. గ్లోబల్ వార్మింగ్‌ను పూర్వస్థాయి కంటే 1.5 డిగ్రీల సెల్సియస్‌కు పరిమితం చేస్తే వాతావరణ ప్రేరిత నీటి ఒత్తిడిని 50 శాతం వరకు తగ్గించవచ్చు. గత దశాబ్దంలో 90 శాతానికి పైగా విపత్తులు తీవ్ర వాతావరణ పరిస్థితుల కారణంగానే తలెత్తాయి. 2040 నాటికి ప్రపంచ వ్యాప్తంగా ఇంధన డిమాండ్ 25 శాతానికి, నీటి డిమాండ్ 50 శాతానికి పైగా పెరగనుందని అంచనా. 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా అందరికీ నీరు, పారిశుధ్యం కల్పించాలని ఐరాస లక్ష్యంగా పెట్టుకుంది. 2018–2028 దశాబ్దాన్ని 'వాటర్ ఫర్ సస్టెనెబుల్ డెవలప్‌మెంట్'గా ఐరాస జనరల్ అసెంబ్లీ ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పాఠశాలలో సగానికంటే ఎక్కువ స్కూళ్లలో విద్యార్థులకు హ్యాండ్ వాషింగ్ సౌకర్యాలు లేవు. కనీసం చేతులు కడుక్కోవడానికి నీరు, సబ్బు కూడా అందుబాటులో లేని స్కూళ్లు కూడా చాలా ఉన్నాయి. అపరిశుభ్రమైన నీరు తాగి ప్రతి ఏడాది ప్రపంచ వ్యాప్తంగా 2,97,000 మంది అంటే సుమారు రోజుకు 800 మంది పిల్లలు అతిసారం బారిన పడి చనిపోతున్నారు. ఈ కారణాల చేత ప్రతి ఒక్కరూ నీటి ఆవశ్యకతను గుర్తించి వాననీటిని ఒడిసి పట్టడమే కాకుండా,నీటినిజాగ్రత్తగా వాడుకునే విధంగా వ్యవహరించాలి.

# బాధ్యతలు చేపట్టేదెవరు?

న్యూఢిల్లీ,ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అరెస్ట్ అంశం దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. దేశంలో పదవిలో ఉండగా అరెస్ట్ అయిన తొలి ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాలే. గతంలో అరెస్ట్‌కు ముందు కొంతమంది ముఖ్యమంత్రులు తమ పదవులకు రాజీనామా చేశారు. మరికొందరు మాజీ ముఖ్యమంత్రులు వివిధ కేసుల్లో అరెస్ట్ అయ్యారు.దాణా కుంభకోణం కేసులో బీహార్ మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్, కలర్ టీవీల కొనుగోళ్లలో అక్రమాలు, ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో తమిళనాడు మాజీ సీఎం జయలలిత, టీచర్ నియామకాల్లో అక్రమాలపై హర్యానా మాజీ ఓం ప్రకాశ్ చౌతాలా, ఝార?ండ్ మాజీ ముఖ్యమంత్రులు మధు కోడా మైనింగ్ కేసులో, హేమంత్ సోరెన్ భూ కుంభకోణం కేసుల్లో అరెస్ట్ అయ్యారు. కానీ అరవింద్ కేజ్రీవాల్ మాత్రం అరెస్ట్‌పై బలమైన సంకేతాలు అందినా పదవిని వదులుకోలేదు. చివరి వరకు న్యాయపోరాటం చేశారు.ఢిల్లీ మద్యం పాలసీ కేసులో అరవింద్ కేజ్రీవాల్‌కు ఈడీ 9సార్లు నోటీసులు ఇచ్చింది. అయినా ఆయన విచారణకు హాజరుకాలేదు. ఎందుకంటే అరెస్ట్‌ను ముందే ఊహించారు. అందుకే ఈడీ తనను అరెస్ట్ చేయకుండా రక్షణ కల్పించాలని ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. కానీ అక్కడ ఊరట లభించలేదు. అరెస్ట్‌పై రక్షణ కల్పించడం సాధ్యంకాదని న్యాయస్థానం స్పష్టం చేసింది. దీంతో ఆయన సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. గురువారం రాత్రి అత్యవసరంగా ఈ పిటిషన్‌పై విచారణ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆ పిటిషన్ విచారణ సుప్రీంకోర్టులోకి రాకముందే అరవింద్ కేజ్రీవాల్‌ను ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు. శుక్రవారం ఈ పిటిషన్‌పై విచారణ జరిగే ఛాన్స్ ఉంది.ఢిల్లీలో శుక్రవారం కీలక రాజకీయ పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. కేజ్రీవాల్‌ను ఈడీ కస్టడీకి కోర్టు అనుమతి ఇస్తే పరిస్థితేంటి? అనే చర్చ జరుగుతోంది. ఆ పరిస్థితులు ఎదురైతే కేజ్రీవాల్ సీఎం పదవికి రాజీనామా చేస్తారా? ఇదే ఇప్పుడు కీలక అంశంగా మారింది. అలా జరిగితే ఢిల్లీ సీఎం బాధ్యతలు ఎవరు చేపడతారనే చర్చ నడుస్తోంది. కేజ్రీవాల్ భార్య సునీతా పేరు ప్రధానంగా వినిపిస్తోంది. ఆమె రిటైర్డ్ ఐఆర్ఎస్ ఆఫీసర్. అధికారిగా పాలనాపరమైన అనుభవం ఉంది. అలాగే కేజ్రీవాల్ కేబినెట్‌లోని మంత్రులు సౌరబ్ భరద్వాజ్, ఆతిశీ పేర్లు కూడా తెరపైకి వచ్చాయి.అరవింద్ కేజ్రీవాల్ 2012లో ఆమ్ ఆద్మీ పార్టీని స్థాపించారు. అప్పటి నుంచి ఆయనే పార్టీకి కన్వీనర్‌గా ఉన్నారు. 3 పర్యాయాలు ఢిల్లీ సీఎంగా బాధ్యతలు చేపట్టారు. దేశవ్యాప్తంగా పార్టీ విస్తరణపై ఫోకస్ పెట్టారు. ఈ క్రమంలో పంజాబ్‌లో ఆప్ అధికారం దక్కించుకుంది. ఇప్పుడు దేశంలో మూడో పెద్ద పార్టీ ఆప్. సార్వత్రిక ఎన్నికలకు ముందుకు కేజ్రీవాల్ అరెస్ట్ కావడం ఆప్‌కు గట్టి దెబ్బే.కేజ్రీవాల్ జైలులో ఉంటే పార్టీకి ఎవరు నాయకత్వం వహిస్తారనేది ప్రశ్నార్థంగా మారింది. ఆప్‌లో నంబర్ టూగా ఉన్న మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా ఇప్పటికే ఢిల్లీ మద్యం కుంభకోణంలో అరెస్టై జైలులో ఉన్నారు. కేజ్రీవాల్ కేబినెట్‌లో మంత్రిగా చేసిన సత్యేందర్ జైన్ మరో కేసులో జైలు పాలయ్యారు. ప్రస్తుతం మధ్యంతర బెయిల్‌పై ఉన్న ఆయనకు ఇటీవల కోర్టు పూర్తి స్థాయి బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. ఇలా వరుస ఎదురుదెబ్బలు ఆప్‌కు తగిలాయి. చివరికి ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అరెస్ట్‌కు దారితీశాయి.

# కొత్త వీసీలు!

హైదరాబాద్,రాష్ట్రంలో విద్యాశాఖ పరిధిలోని పది యూనివర్శిటీలకు కొత్త వీసీలు జూన్‌లో రానున్నారు. మే నెల 24తో ప్రస్తుత యూనివర్శిటీ వీసీల పదవీ కాలం ముగియనుంది. ఎన్నికల కోడ్ రావడంతో కొత్త వీసీల నియామకాల ప్రక్రియ కాస్త ఆలస్యమయ్యేలా కనబడుతోంది. ప్రభుత్వం మాత్రం కేంద్ర ఎన్నికల సంఘం నుంచి అనుమతి తీసుకొని వీసీల నియామక ప్రక్రియను చేపట్టాలని యోచిస్తోంది.ఎన్నికల సంఘం అనుమతినిస్తేగానీ మే 24వ తేదీకి ముందే నియామక ప్రక్రియను పూర్తి చేయాలని భావిస్తోంది. ఒకవేళ వీసీల నియామక ప్రక్రియ మాత్రం ఆలస్యమైతే కొత్త వీసీలు వచ్చే వరకూ ఇంఛార్జీలను నియమించాలని ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కొనసాగుతున్న యూనివర్శిటీ వీసీలు మాత్రం తమనే ఇంకా కొన్ని నెలలు కొనసాగించాలని ప్రభుత్వ పెద్దలను కలిసి విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలుస్తోంది.కొత్త వీసీల నియామకాల కోసం ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన పూర్తయింది. రాష్ట్రంలో విద్యాశాఖ పరిధిలోని పది వర్శిటీలకు కొత్త వీసీల నియామకానికి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసి దరఖాస్తులను కూడా ఇప్పటికే స్వీకరించింది.

# మోదీ అధికార దురహంకారం.. కేజ్రీవాల్ అరెస్ట్‌పై భార్య సునీత



న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధినేత, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను లిక్కర్ పాలసీ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్ట్ చేయడంపై ఆయన భార్య సునీతా కేజ్రీవాల్ శుక్రవారం స్పందించారు. ప్రధాని మోదీ అధికార దురహంకారమని ఆరోపించారు. అందరినీ అణిచివేసేందుకు మోదీ ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేయడం ఢిల్లీ ప్రజలకు ద్రోహం చేయడమేనని అన్నారు.కాగా, సునీతా కేజ్రీవాల్ ఈ మేరకు ఎక్స్‌లో ఒక పోస్ట్ చేశారు. 'మూడుసార్లు ఎన్నికైన మీ ముఖ్యమంత్రిని మోదీ అధికార అహంకారంతో అరెస్టు చేశారు. అందరినీ అణిచివేసేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారు. ఇది ఢిల్లీ ప్రజలకు చేసిన ద్రోహం. మీ ముఖ్యమంత్రి ఎప్పుడూ మీ వెంటే ఉన్నారు. జైలు లోపల అయినా బయట అయినా, ఆయన జీవితాన్ని దేశానికి అంకితం చేశారు. ప్రజలే సుప్రీం. ప్రతిదీ వారికి తెలుసు. జై హింద్' అని హిందీలో ట్వీట్ చేశారు.మరోవైపు అరవింద్ కేజ్రీవాల్‌ను ఢిల్లీలోని రూస్ అవెన్యూ కోర్టులో ఈడీ హాజరుపరిచింది. మద్యం పాలసీ స్కామ్‌లో ఆయన కీలక కుట్రదారుడని ఆరోపించింది. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ 2021–22ను రూపొందించి అమలు చేసేందుకు 'దక్షిణాది గ్రూప్' నుంచి అనేక కోట్లు ముడుపులుగా స్వీకరించారని తెలిపింది. దీనిపై విచారణ కోసం అరవింద్ కేజ్రీవాల్‌ను పది రోజులు తమ కస్టడీకి అప్పగించాలని కోర్టును ఈడీ కోరింది. అయితే ఈ నెల 28 వరకు ఆరు రోజులపాటు ఈడీ కస్టడీకి కోర్టు అనుమతించింది.

# బీఆర్ఎస్‌లో ఎందుకు చేరారో అసలు విషయం చెప్పిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

హైదరాబాద్, తన రాజకీయ ప్రస్థానంలో ఇటీవల జరిగిన కొన్ని పరిణామాలు మిమ్మల్ని బాధపెట్టి ఉండవచ్చని శ్రేయోభిలాషులను ఉద్దేశించి నాగర్‌కర్నూలు పార్లమెంటు అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఒక ఉన్నతమైన లక్ష్య సాధన కోసం కొన్ని త్యాగాలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. అయితే ఈ విషయాన్ని అర్థం చేసుకోకుండా.. తన మీద సోషల్‌మీడియా వేదికగా కొన్ని శక్తులు ( కొంతమంది ఆప్తులతో సహా ) తీవ్రమైన దాడి చేశాయని.. ఇంకా చేస్తూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి అనాగరికమైన దాడులు తనకు కొత్త కాదని తెలిపారు. పేద ప్రజల జీవితాలను సమూలంగా మార్చాలన్న లక్ష్యం నుంచి తనను ఈ చిల్లర రాజకీయాలు దూరం చేయలేవని స్పష్టం చేశారు. తన మీద నమ్మకంతో నాగర్‌కర్నూలు బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రకటించినందుకు కేసీఆర్‌కు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు.

నన్ను దయచేసి నమ్మండి

ఇన్నాళ్లూ పీడిత ప్రజల కోసం నిస్వార్థంగా పనిచేశానని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. చట్టసభల్లో కూడా మీ గొంతుకగా ఉండాలనే లక్ష్యంతో.. ఎంతో విలువైన ఉద్యోగాన్ని సైతం వదిలి రాజకీయాల్లోకి వచ్చానని అన్నారు. అసెంబ్లీలో బహుజనుల గొంతుకగా ఉండాలని రాత్రింబవళ్లు శ్రమించినా మొదటి ప్రయత్నంలో విఫలమయ్యానని అన్నారు. తెలంగాణ వాదం – బహుజనవాదం రెండూ ఒక్కటేనని నమ్మి ఎంతో శ్రమించి కేసీఆర్, మాయావతిని ఒప్పించి తెలంగాణలో చారిత్రాత్మక పొత్తు ఏర్పాటయ్యేలా చూశానని చెప్పారు. కానీ కొన్ని అనివార్య కారణాల వల్ల అది చివరి నిమిషంలో రద్దయ్యిందని అన్నారు. ఇచ్చిన మాట మేరకు విశాల తెలంగాణ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని, దేశంలో కోట్లాది బహుజనుల బంగారు భవిష్యత్తు కోసం, భారత రాజ్యాంగ



విలువల రక్షణ కోసం, కేసీఆర్‌తోనే కలిసి ప్రయాణించాలనుకున్నా అని తెలిపారు. బీజేపీ కుట్రల నుంచే దేశాన్ని రక్షించే దమ్ము–ధైర్యం కాంగ్రెస్‌కు ముమ్మాటికీ లేదని..అందుకే ఇటీవల బీఆర్ఎస్‌లో చేరానని స్పష్టం చేశారు.

నేను చట్టసభలో కూర్చుంటే.. మీరందరూ అక్కడ కూర్చున్నట్లే

ఈ యుద్ధంలో కేసీఆర్ మార్గదర్శనంలో సర్వశక్తులొడ్డి విజయం కోసం పోరాడతానని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. దయచేసి తనతో కలిసి రావాలని.. చేతనైతే సాయం చేయాలని పిలుపునిచ్చారు. ' మీ విలువైన సమయం ఇచ్చి.. నాగర్‌కర్నూలు నియోజకవర్గానికి వచ్చి కారు గుర్తుకు ఓటేయ్యాలని ఇంటింటికీ ప్రచారం చేయండి.. లేదా మీకు తెలిసిన వారందరికీ కనీసం ఫోన్ చేసి అయినా చెప్పండి' అని కోరారు. తాను చట్టసభల్లో కూర్చుంటే మీరందరూ అక్కడ కూర్చున్నట్టే.. నేను నేను కాదు.. నేను మీరే అని తెలిపారు.

# ఏసీబీ వలలో తస్లీమా...

మహబూబాబాద్ : లంచం తీసుకుంటూ మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ శుక్రవారం ఏసీబీ అధికారులకు చిక్కారు. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం దాట్ల గ్రామానికి చెందిన గుండగాని హరీశ్ తన 128 గజాల స్థలానికి రిజిస్ట్రేషన్ కోసం ఈనెల మొదటి వారంలో సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్‌ను సంప్రదించాడు. ఆమె సూచన మేరకు కార్యాలయ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి ఆలేటి వెంకటేశ్‌ను కలువగా.. ప్రభుత్వ ధర ప్రకారం గజానికి రూ.100 ఉంటుందని, కానీ ఇక్కడ మాత్రం గజానికి రూ.200 చొప్పున ఇస్తేనే రిజిస్ట్రేషన్ చేస్తామని వెంకటేశ్ చెప్పాడు. దీంతో హరీశ్ మళ్లీ సబ్ రిజిస్ట్రార్‌ను కలిశాడు. మొత్తం రూ.19,200 ఇస్తేనే రిజిస్ట్రేషన్ చేస్తామని చెప్పింది. వెంటనే ఆయన వరంగల్ ఏసీబీ అధికారులను సంప్రదించాడు. ఒప్పందంలో భాగంగా హరీశ్ శుక్రవారం కార్యాలయానికి వెళ్లి సబ్ రిజిస్ట్రార్ తస్లీమాకు డబ్బులు ఇవ్వబోయాడు. ఆఫీస్‌లో పనిచేసే వెంకటేశ్‌కు ఇవ్వాలని ఆమె సూచించడంతో బాధితుడు హరీశ్ రూ.19,200ను వెంకటేశ్‌కు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వెంకటేశ్ వద్ద రూ.19,200లతోపాటు అదనంగా 1.72 లక్షలు లభించాయి. అదనపు డబ్బులు ఎవరి నుంచి తీసుకున్నాడనే వివరాలు ఇంకా తెలియరాలేదు. కార్యాలయంలో సోదాలు కూడా నిర్వహించారు. కేసు నమోదు చేసిన ఏసీబీ అధికారులు సబ్ రిజిస్ట్రార్ తస్లీమాతోపాటు అవుట్ సోర్సింగ్ ఉద్యోగి వెంకటేశ్‌పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్టు ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపారు.

అవినీతి మార్గం.. సేవ పేరుతో ప్రచారం

అవినీతిని మార్గంగా ఎంచుకొని సేవ పేరుతో ప్రచారం పొందుతున్న మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ మహమ్మద్ తస్లీమా నస్రిన్ నైజం బయటపడింది.



తస్లీమాకు ఉద్యోగం వచ్చిన తర్వాత ములుగు జిల్లా సబ్ రిజిస్ట్రార్‌గా 12 ఏండ్లు అకడే విధులు నిర్వహించింది. గత ఏడాది బదిలీల్లో భాగంగా మహబూబాబాద్‌కు వచ్చింది. ప్రభుత్వ సెలవులు వస్తే చాలు మహిళలతో కలిసి నాట్లు వేయడం, పత్తి ఏరడం, మిర్చి తెంపడం వంటి కార్యక్రమాలు చేస్తూ సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం చేసుకుంటుంది. కార్యాలయానికి వచ్చే సమయంలో ఆటో, బస్సు, ద్విచక్ర వాహనాల్లో ప్రయాణం చేస్తూ విస్తృత ప్రచారం చేస్తుంది. ఈమె ఒక ట్రస్ట్ ఏర్పాటు చేసి అనాథ పిల్లలకు దుస్తులు పంపిణీ చేయడం, ఎవరైనా మరణిస్తే వారి ఇంటికి వెళ్లి 25 కిలోల బియ్యం బస్తా, నగదు ఇచ్చి ఫొటోలు దిగడం వాటిని సోషల్ మీడియాలో షేర్ చేయడం చేస్తుంటుంది. తస్లీమా మరో కోణంలో రాజకీయ నాయకులకు, ప్రజా ప్రతినిధులతో సెల్ఫీలు దిగుతూ బాబాయ్, తమ్ముడు అంటూ వరుసలు కలిపేస్తుంది. ఏసీబీ అధికారుల దాడుల్లో తస్లీమా అసలు నైజం బయటపడింది.

# డ్రగ్స్ రాకెట్! బ్రెజిల్ నుంచి విశాఖకు సప్లయ్



విజయవాడ : డ్రగ్స్ ..అదే మాదక ద్రవ్యాలు.. కొకైన్, హెరాయిన్ పేర్లు వినపడగానే.. సినీ సెలబ్రిటీస్ గుర్తుకు వస్తారు. తెలంగాణలో సినీ పరిశ్రమకు కేంద్రం కావటంతో.. మాదక ద్రవ్యాల వ్యాపారం జోరుగా సాగుతుంది. అయితే.. ప్రతి సారి డ్రగ్స్ ముఠా దొరకటం ఆలస్యం.. నైజీరియా పెడ్లర్స్‌ను పట్టుకుని పోలీసులు అరెస్టు చూపిస్తారు. సినీ హీరోలు, బంధువులు, రాజకీయ ప్రముఖుల బిడ్డలు, పోలీసుల ఉన్నతాధికారుల బంధువులు తెరమీదకు రావటం.. మీడియాలో కథలు కథలు మార్మోగటం ఇప్పటిదాకా తెలిసిందే. కానీ, ఇప్పుడు ఏపీ ఆర్థిక రాజధానిని కేంద్రంగా చేసుకుని చేస్తున్న నయా దాందా వెలుగులోకి వచ్చింది. తెలంగాణలో డ్రగ్స్ కలకలం రేపితే.. ఆంధ్రాలో డ్రగ్స్ దిగుమతి కేసులు కలవరం సృష్టిస్తున్నాయి. ఈ వ్యవహారం వెనుక రాజకీయ అండ ఉన్నదనే కథలు వినిపిస్తున్నాయి. కొన్నాళ్ల కిందట గుజరాత్‌లో ఓ షిప్‌లో ?500 కోట్ల విలువ చేసే కొకైన్ దొరికింది. దాని విలువ రూ.25వేల కోట్లు ఉంటుందని అంచనా వేశారు. ఇక.. గుజరాత్ ఓడరేవుకు, కాకినాడ రాజకీయ నాయకుడికి సంబంధం కూడా ప్రచారంలోకి వచ్చింది. తాజాగా ఏపీలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య ఈ ఆరోపణలు, పత్యారోపణలు జోరందుకున్నాయి. తాజాగా విశాఖపట్నంలో 25 టన్నుల కొకైన్ మిక్సిడ్ డ్రై ఈస్ట్ లభించడంతో ఇప్పుడు ఏపీ పేరు అంతర్జాతీయ స్థాయిలో మార్మోగిపోతోంది.

ఈ డ్రై ఈస్టుకు ఇంత పాపులారిటీ దేనికి?

డ్రై ఈస్ట్ పదార్థం అంటే నిజానికి ఓ వ్యర్థ పదార్థంలో ఉత్పత్తి. కుళ్లిన తియ్యని పండ్లు, ఆహార పదార్థాల నుంచి డ్రైఈస్ట్ తయారవుతుంది. ఈ డ్రైఈస్ట్కి ఆంధ్రప్రదేశ్ ఆక్వా కంపెనీకి సంబంధం ఏమిటీ? యూరప్ కంట్రీల్లో మిగిలిన ఆహార పదార్థాలను ఉచితంగా ఇచ్చేస్తారు. ఈ పదార్థాల నుంచి డ్రైఈస్ట్ తయారు చేసిన కంపెనీలు చాలా చౌకగా విక్రయిస్తాయి. దీంతో ఐరోపా దేశాల నుంచి డ్రైఈస్ట్ను భారతీయ కంపెనీలు దిగుమతి చేసుకుంటాయి. ఎందుకంటే%ూ% పశువుల మేతకు, చేపలు, రొయ్యల మేతకు డ్రైఈస్ట్ను ఉపయోగిస్తారు. ఈ డ్రైఈస్ట్లో ప్రొటీన్లు, సీ విటమిన్లు, భాస్వరం, అమినో ఆమ్లాలు ఉంటాయి. అంతే కాదు, డ్రైఈస్టును ఆల్కహాల్ తయారీలోనూ వినియోగిస్తారు. అంటే బేవరేజెస్ కూడా డ్రైఈస్ట్ కోసం క్యూకడతాయన్న మాట.

ఇంతకీ విశాఖలో దొరికిన డ్రైఈస్ట్ సంగతేంటీ?

బ్రెజిల్ నుంచి విశాఖపట్నం చేరుకున్న ఈ డ్రైఈస్ట్ ఏపీలో వినియోగం ఎక్కువ. సాధారణంగా ఆక్వాకల్చర్లో వినియోగం కావటంతో.. డ్రైఈస్ట్ దిగుమతిపై అంతగా నిఘా ఉండదు. వ్యవసాయ రంగంలో అనుబంధ పరిశ్రమలకు అవసరమైన ఉత్పత్తి కావటంతో దేశీయ నిఘా వ్యవస్థ పట్టించుకోలేదు. ఇంటర్ పోల్ నిఘాలో డ్రైఈస్ట్ ముసుగులో డ్రగ్స్ రవాణ కథ వెలుగు చూడటంతో యావత్ భారత దేశం కంగుతింది. నిన్న విశాఖలో ఇన్ యాక్టివ్ డ్రైఈస్ట్లో కొకైన్ జాడ కనిపించగా%ూ% శుక్రవారం హైదరాబాద్‌లో సుమారు రూ. 9 కోట్ల విలువ చేసే కొకైన్ దొరికింది. ఈ కొకైన్ కూడా బ్రెజిల్ నుంచే డ్రైఈస్ట్ రూపంలో హైదరాబాద్‌కు చేరిందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇన్ యాక్టివ్ డ్రైఈస్ట్ ను దిగుమతి చేసిన సంధ్యా ఎక్స్ పోర్టర్స్ చుట్టూ డ్రగ్స్ ఉచ్చు బిగుస్తోంది. ఇప్పటికే ఈ సంస్థ ప్రతినిధులను సీబీఐ ప్రశ్నించింది. ఇక దర్యాప్తును ముమ్మరం చేస్తోంది.

కాకినాడలోని సంధ్య అక్వాలో సిబిఐ తనిఖీలు

కాకినాడ జిల్లా యు కొత్తపల్లి మండలం మూలపేటలో ఉన్న సంధ్య ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ పరిశ్రమలో సీబీఐ దాడులు చేపట్టింది. ఉదయం 11 గంటల నుంచి ఏడుగురు సీబీఐ అధికారుల బృందం వివిధ భాగాల్లో తనిఖీలు చేశారు. ఇప్పటికే పరిశ్రమలో పనిచేస్తున్న సిబ్బంది, కూలీల నుంచి వివరాలు సేకరించారు. ల్యాబ్‌ను పరిశీలించి ఫోరెనిక్స్ బృందాన్ని పిలిపించారు. వైజాగ్ నుంచి ఫోరెన్సిక్ బృందం పరిశ్రమకు చేరుకుంది. ల్యాబ్‌లో ఉన్న వివిధ శాంపిల్స్ సేకరించి విశాఖకు తరలించినట్లు సమాచారం.

# ఎస్సీ వర్గీకరణ పేరుతో బిజెపి, బిఆర్ఎస్ రాజకీయం



హైదరాబాద్,ఎస్సీ వర్గీకరణ పేరుతో రాజకీయ ప్రయోజనాల కోసం మాదిగలను బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు వాడుకుంటున్నాయని మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ అన్నారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... రెండున్నర దశాబ్దాలుగా ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వర్గీకరణ పేరుతో మాదిగల హక్కులను మోసం చేసే కుట్రలు జరుగుతున్నాయని చెప్పారు. మాదిగ జాతిని బీజేపీ, బీఆర్ఎస్ అణగదొక్కాయని ధ్వజమెత్తారు. ఏ ఎండకు ఆ గొడుగు పడుతున్న ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగను హెచ్చరించారు. మాదిగల ఆత్మ గౌరవాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీకి తాకట్టు పెట్టొద్దని అన్నారు. రిజర్వేషన్లకు మొదటి అడుగు వేసిందే కాంగ్రెస్ అని చెప్పారు. పలు సందర్భాల్లో కాంగ్రెస్‌నే న్యాయబద్ధంగా రిజర్వేషన్లను అమలు చేయగలదని మంద కృష్ణ మాదిగ చెప్పలేదా అని ప్రశ్నించారు. ప్రధాని మన్మోహన్ హయాంలో వర్గీకరణ రాష్ట్రాలకు అప్పజెప్పాలనీ ఉషా మెహ్రా కమిషన్‌ను కాంగ్రెస్ వేసిందని తెలిపారు. పదేళ్లపాటు మాదిగలను బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు నిలువునా ముంచాయని విరుచుకుపడ్డారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో మాదిగలు ఆగమవుతుంటే మంద కృష్ణ మాదిగ ఎక్కడున్నారని ప్రశ్నించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉషా మెహ్రా కమిషన్ వేసిందని మంద కృష్ణకు తెలియదా..? అని నిలదీశారు. 341(జీ) సవరించి ఉషా మెహ్రా కమిషన్ నివేదికను బీజేపీ ప్రభుత్వం ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదు..? అని నిలదీశారు. బీజేపీనే దళితుల వ్యతిరేక పార్టీ, దళితుల హక్కులను కాలరాసే పార్టీ అని చెప్పారు. మనువాద పార్టీ బీజేపీని భుజాన ఎత్తుకోవడం మంద కృష్ణకు మంచిది కాదన్నారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని అన్నారు. మాదిగలకు తమ పార్టీలోనే న్యాయం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ చరిత్రే సామాజిక న్యాయమని చెప్పారు. మోదీ కౌగిలింతలకు మందకృష్ణ లొంగిపోయారా..? అని ఎద్దేవా చేశారు. బీజేపీని మోయమంటున్న మంద కృష్ణ పదేళ్లలో ఆ పార్టీ దళితులకు ఏం చేసిందో చెప్పాలని ప్రశ్నించారు. దళిత బిడ్డ అయినందుకే సంపత్ కుమార్‌కు కాంగ్రెస్ టికెట్ ఇవ్వలేదని మంద కృష్ణ అంటున్నారని చెప్పారు. గ్రామీణ బిడ్డ అయినా తనను గుర్తించి కాంగ్రెస్ ఎమ్మెల్యేను చేసిందని తెలిపారు. కాంగ్రెస్ తనకు గాడ్ ఫాదర్‌లాంటిదని అన్నారు. మరో 20 ఏళ్ల పాటు సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ తెలంగాణలో అధికారంలో ఉంటుందని చెప్పారు. దళితుల ఆత్మ గౌరవాన్ని మంద కృష్ణ మోదీకి తాకట్టు పెట్టారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ లేకుంటే ఆయన ఎక్కడ ఉండేవారో తెలుసుకోవాలని అన్నారు. మంద కృష్ణ కళ్లకు బీజేపీ ముసుగు తొడిగిందని మండిపడ్డారు. మాదిగల జాతికే వ్యతిరేకమైన కమలం పార్టీని ఆయన ఎందుకు మోస్తున్నారో, ఎలా అంటకాగుతున్నారో జవాబు చెప్పాలని అన్నారు. తనకు అన్యాయం జరుగుతుందని హై కమాండ్‌కు లేఖ రాశానని అధిష్ఠానం నిర్ణయం తీసుకున్నాక ఆ నిర్ణయానికి కట్టుబడి ఉన్నానని చెప్పారు. కాంగ్రెస్ గొడుగు కింద ఎదిగానని.. ఆ గొడుగు కిందే ఒదిగి ఉంటానని సంపత్ కుమార్ అన్నారు. అంతకు ముందు... సంపత్ కుమార్‌తో నాగర్ కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లు రవి శుక్రవారం నాడు భేటీ అయ్యారు. సంపత్ ఇంటికి వెళ్లి తనకు సహకారం అందించాలని కోరారు. ఇప్పటి వరకు నాగర్ కర్నూల్ స్థానాన్ని సంపత్ ఆశించారు. సీఎం రేవంత్‌రెడ్డిని సంపత్, మల్లు రవి కలిశారు. నాగర్ కర్నూల్ పార్లమెంట్‌లో కాంగ్రెస్ విజయానికి చేయాల్సిన వ్యూహంపై చర్చించారు. మల్లు రవి, సంపత్ కుమార్‌లతో సుదీర్ఘంగా చర్చించారు. నాగర్ కర్నూల్‌లో విజయం సాధించేందుకు ఇద్దరు నాయకులకు సీఎం రేవంత్ దిశా నిర్దేశర చేశారు.

# బంతి గంటా కోర్టులోనే.. తేల్చుకోవల్సింది ఆయనే!

అమరావతి,చేస్తే చీపురుపల్లి నుంచి పోటీ చేయి, లేకుంటే పార్టీ కోసం పని చేయి.. ఇదీ మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావుకు తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు ఇచ్చిన సంకేతం. వచ్చే లోక్ సభ, అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థుల మూడో జాబితా శుక్రవారం (మార్చి 22) విడుదల చేసిన చంద్రబాబు ఈ జాబితాలో గంటా పోటీ చేయాలని భావిస్తున్న భీమిలీ నియోజకవర్గానికీ, అలాగే గంటాను తాను పోటీ చేయమని చెబుతున్న చీపురుపల్లి నియోజకవర్గానికీ అభ్యర్థులను ప్రకటించకుండా పెండింగ్ లో ఉంచారు.తద్వారా చంద్రబాబు తన ఉద్దేశమేమిటన్నది స్పష్టంగా చాటారు. చీపురుపల్లి నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీలో ఉన్న మంత్రి, ఆ పార్టీ సీనియర్, కీలక నేత బొత్స సత్యాన్నారాయణపై గంటాను పోటీకి నిలబెట్టాలని చంద్రబాబు భావిస్తున్నారు. ఇదే విషయాన్ని ఆయన నియోజకవర్గ ఇప్పటికే విస్పష్టంగా గంటాకు తెలియజేశారు. అయితే గంటా మాత్రం తాను విశాఖ జిల్లాలోని ఏదో ఒక నియోజకవర్గం నుంచి పోటీ చేస్తాననీ, చీపురుపల్లిలో అయితే విజయావకాశాలపై నమ్మకం లేదనీ అంటున్నారు. అయితే చంద్రబాబు మాత్రం సర్వేలన్నీ అనుకూలంగా ఉన్నాయి, గంటా అయితే అక్కడ కచ్చితంగా విజయం సాధిస్తారని అంటున్నారు. ఈ విషయంలో గంటా ఇంకా ఏమీ తేల్చుకోకపోవడంతో తాజాగా విడుదల చేసిన జాబితాలో భీమిలి, చీపురుపల్లి నియోజకవర్గాలను పెండింగ్ లో ఉంచిన చంద్రబాబు నాయుడు ఇక బంతిని గంటా కోర్టులోనే వేశారు.ఒక



వేళ చీపురుపల్లి నుంచి పోటీకి గంటా సంసిద్ధత వ్యక్తం చేయకుంటే ఆయన సేవలను పూర్తిగా పార్టీకి వినియోగించుకుంటామని చంద్రబాబు చెప్పినట్లు తెలుస్తోంది. భీమిలీ, చీపురుపల్లి మాత్రమే కాకుండా చంద్రబాబు మూడో జాబితాలో ఇంకా ఎచ్చర్ల, ధర్మవరం కూడా పెండింగ్ లో ఉంచారు. ఆ నియోజకవర్గాల నుంచి తెలుగుదేశం సీనియర్ నాయకుడు కళావెంకటరావు, పరిటాల శ్రీరామ్ లు పార్టీ టికెట్ ఆశిస్తున్నారు. అయితే ఈ రెండు స్థానాలూ పొత్తులో భాగంగా బీజేపీకి కేటాయించే అవకాశం ఉందని అంటున్నారు.

# కాంగ్రెస్,బిజెపిలకు దిక్కులేదు

హైదరాబాద్,: కాంగ్రెస్, బిజెపిలకు దిక్కులేక బిఆర్ఎస్ నేతలను రప్పించి టిక్కెట్లు ఇస్తున్నారని, బీఆర్ఎస్ నుంచి వేరే పార్టీలోకి వెళ్లేవారిని వదిలిపెట్టేది లేదని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి హెచ్చరించారు. పార్టీ మారే నేతలు పదవులకు రాజీనామా చేసి వెళ్లాలని చెప్పారు. పార్టీ మారిన నేతలని ప్రజలు చెప్పులతో కొడతారని వార్నింగ్ ఇచ్చారు. శుక్రవారం నాడు తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీకి పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయడానికి ఎంపీ అభ్యర్థులు లేక తమ పార్టీ నేతల వెంట పడుతున్నారని మండిపడ్డారు. కొందరు పిరికి పందలు పార్టీ మారుతున్నారని ధ్వజమెత్తారు. స్వలాభం కోసం రాజకీయాలను భ్రష్టు పట్టించిన నేతలు ఒక పార్టీలో గెలిచి మరో పార్టీలోకి వెళ్లడం శోచనీయమని అన్నారు. అక్రమాలు చేసిన వారు పార్టీ మారితే వారి అక్రమాలను బీఆర్ఎస్సే బయట పెడుతుందని హెచ్చరించారు. అకాల వర్షాల వల్ల రాష్ట్రంలో రెండు లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని చెప్పారు. వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులకు భరోసా కల్పించకుండా గత కేసీఆర్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం తగదని అన్నారు.




# ఓటు హక్కున్న ప్రతి ఒక్కరూ ఓటేయాలి

హనుమకొండ,ఓటు హక్కు కలిగిన ప్రతి ఓటరు ను ఎన్నికల్లో ఓటు వేసే విధంగా చైతన్యపరచాలని ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో స్వీప్ ఆధ్వర్యంలో లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో వివిధ శాఖల అధికారులు, వివిధ స్వచ్ఛంద సంస్థలు, అపార్ట్‌మెంట్ల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో ఓటరు చైతన్య కార్యక్రమాలపై సమావేశాన్ని నిర్వహించారు.ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా మాట్లాడుతూ స్వీప్ ఆధ్వర్యంలో ఓటరు చైతన్య కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఓటింగ్ శాతం తక్కువగా నమోదవుతున్న ప్రాంతాల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ఓటరు చైతన్య కార్యక్రమాలనునిర్వహించాలన్నారు. ఓటరు చైతన్యంపై పలు అవగాహన కార్యక్రమాలను స్వచ్ఛంద సంస్థలు, అపాటంమెంట్స్ అసోసియేషన్లు చేపట్టాలని కోరారు.జిల్లా పంచాయతీ అధికారి, స్వీప్ నోడల్ అధికారి లక్ష్మి రమాకాంత్ మాట్లాడుతూ లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో స్వీప్ ఆధ్వర్యంలో ఓటరు చైతన్యంపై కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్యానికి పునాది అయిన ఓటును ఎన్నికల్లో వినియోగిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com